www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:46 FRIDAY ,JUNE 26,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 46 శుక్రవారం 26 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-

## రైతులెవరూ భయపడొద్దు..
## అందరికీ యూరియా అందిస్తాం



హంసకలం వార్త

జిల్లాలోని చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభా స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం రైతు భరోసా అని చెప్పుకొచ్చారు. జులై నెలలోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. - మిగతా2లో

## మూడు రాష్ట్రాల రైతులకు కొత్త ఆశ..
## తుంగభద్ర వద్ద రేవంత్ కీలక సందేశం

- తుంగభద్ర నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభం
- చరిత్రలో నిలిచే ఘట్టమన్న రేవంత్
- మూడు రాష్ట్రాల రైతులకు ప్రయోజనమని స్పష్టీకరణ
- జల వివాదాలకు పరిష్కారం కావాలని ఆకాంక్ష
- కృష్ణా-గోదావరి సమస్యల పరిష్కారమవుతాయని ఆశాభావం




హంసకలం వార్త

తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ దక్షిణ భారత జలవనరుల చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలుస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కర్ణాటకలోని మునీరాబాద్‌లో నూతన క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ఈ ప్రాజెక్టు మూడు రాష్ట్రాల రైతాంగ భవిష్యత్తుకు కొత్త ఆశలు నింపుతోందని పేర్కొన్నారు.

## ఇరాన్‌లో పాఠశాల పై అమెరికా క్షిపణుల దాడి.. ఖండించిన ట్రంప్

హంసకలం వార్త

దక్షిణ ఇరాన్‌లోని మినాబ్‌లో పాఠశాల పై జరిగిన దాడిలో అమెరికా పాత్ర ఉందంటూ వస్తున్న వార్తలను డొనాల్డ్ ట్రంప్ ఖండించారు. ఈ దాడికి ఎవరు బాధ్యులో ఎప్పటికీ తెలియక పోవచ్చునని ఆయన తెలిపారు. బుధవారం వాషింగ్టన్ లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విలేకర్లతో -మిగతా2లో



## వెనెజువెలా భూకంపాన్ని ముందే హెచ్చరించిన స్మార్ట్ ఫోన్లు!

హంసకలం వార్త

ప్రకృతి విపత్తులు ఎప్పుడు, ఏ రూపంలో వస్తాయో ఎవ్వరం ఊహించలేము. ముఖ్యంగా భూకంపాలు, సునామీ లాంటి ప్రకృతి విపత్తులు క్షణాల వ్యవధిలోనే పెను విధ్వంసాన్ని సృష్టిస్తాయి. అయితే, సాంకేతికత సరిగ్గా పనిచేస్తే.. కొన్ని క్షణాల ముందస్తు సమాచారమే వేలాది మంది ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఆ మాటలను వెనెజువెలాలో -మిగతా2లో



## పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల సిబ్బంది తీరు పై సీపీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం



- క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహణ
- ఫిర్యాదుదారులతో అమర్యాదగా ప్రవర్తిస్తున్నట్లు రహస్య తనిఖీల్లో వెల్లడి
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సస్పెన్షన్లు, బదిలీలు తప్పవని కఠిన హెచ్చరిక
- పర్యవేక్షణ లోపించినందుకు కొందరు ఇన్‌స్పెక్టర్లకు ఛార్జిమెమోలు జారీ

## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే


- కేసీఆర్ హయాంలో పరిశ్రమలతో భూముల విలువలు పెరిగాయని వెల్లడి
- ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని ఆరోపణ
- రైతు బంధు, దళిత బంధు అంశాల్లో ప్రజలను మోసం చేశారని విమర్శ

హంసకలం వార్త

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు రియల్ ఎస్టేట్‌పై గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. - మిగతా2లో



## తెలంగాణ వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రారంభం



హంసకలం వార్త

తెలంగాణలో ఓటర్ల జాబితాలో పేరుకుపోయిన తప్పులను సరిదిద్ది, పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ' పేరుతో - మిగతా2లో

## తెలంగాణలో 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో కొత్త ఏజెన్సీ ఏర్పాటు

హంసకలం వార్త

రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను భారీ స్థాయిలో ఆకర్షిం చడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ఒక ప్రత్యేక పెట్టు బడుల ప్రోత్సాహక సంస్థను ఏర్పాటు చేయనుంది. ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామ కృష్ణారావు - మిగతా2లో



హంస కలం వార్త
HAMSA KALAM VARTA
శుక్రవారం 26 జూన్ 2026

## ఇరాన్‌లో పాఠశాల పై అమెరికా క్షిపణుల దాడి.. ఖండించిన ట్రంప్

బుధవారం వాషింగ్టన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విలేకర్లతో మాట్లాడారు. ఈ సమస్యను ఎప్పటికైనా పరిష్కరిస్తారో లేదో తనకు తెలియదని ఆయన స్పష్టం చేశారు. జరిగిన ఈ ఘటన చాలా భయంకరమైందని అభివర్ణించారు. కానీ అన్ని చోట్లా క్షిపణులు ఎగురుతున్నాయని తెలిపారు. అయితే ఈ దాడికి పాల్పడిన క్షిపణి అమెరికాదని ఎవరో అన్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అది తమ క్షిపణి కాకపోవచ్చునని పేర్కొన్నారు. అది అమెరికాదే అని నమ్మడానికి తనకు ఎలాంటి ఆధారాలు కనిపించడం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. అది తాము చేసిందని తాను అనుకోవడం లేదని చెప్పారు. ఈ దాడికి యూఎస్ దళాలే బాధ్యత వహించే అవకాశం ఉందని ఆ దేశ మిలటరీ అంతర్గత విచారణలో వెల్లడైందంటూ ఈ ఏడాది మార్చిలో రాయిటర్స్ వెల్లడించింది. దాంతో ఈ వ్యవహారాన్ని అమెరికా రక్షణ శాఖ కార్యాలయం పెంటగాన్.. దీనిపై విచారణకు చేపట్టి ప్రాథమికంగా ఏ నిర్ధారణకు రాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ప్రారంభమైంది. అదే రోజు యూఎస్, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేశాయి. ఈ దాడిలో మినాబ్‌లోని పాఠశాల్లోని 175 మంది మరణించారు. వారిలో చిన్నారులతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు. అంతర్జాతీయ మానవహక్కుల చట్టం ప్రకారం.. పాఠశాల పై ఉద్దేశపూర్వకంగా దాడి చేయడం యుద్ధ నేరం అయ్యే అవకాశం ఉంది. దాంతో పాఠశాలను వాషింగ్టన్ లక్ష్యంగా చేసుకోదని ఆమెరికా అధికారులు బహిరంగంగా వెల్లడించారు.

## తెలంగాణలో 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో కొత్త ఏజెన్సీ ఏర్పాటు

ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఈ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా (ఎండీ) నియమితులయ్యే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ నూతన ఏజెన్సీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ దాదాపు తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం, వివిధ ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేయడం, సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయడం వంటివి ఈ ఏజెన్సీ ప్రధాన విధులుగా ఉండనున్నాయి. ముఖ్యంగా ఐటీ, ఫార్మా, లాజిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఇందులో ఒక 'ఇన్వెస్ట్ సెల్'ను కూడా ఏర్పాటు చేయనున్నారు. గత మే నెలలో ఐటీ, పరిశ్రమల శాఖలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. పెట్టుబడుల ఆకర్షణలో దూకుడుగా వ్యవహరించేందుకు తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఈ ఏజెన్సీకి ఒక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌తో పాటు, కీలక రంగాలకు వేర్వేరుగా డైరెక్టర్లను నియమించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన కె. రామకృష్ణారావు జూన్ 30న పదవీ విరమణ చేయనున్నారు.

## పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల సిబ్బంది తీరు పై సీపీ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం

హైదరాబాద్ పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల కొందరు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు పై నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రజలతో అమర్యాదగా, బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్న సిబ్బంది పై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఉన్నతాధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్ లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి నేర సమీక్షా సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "కష్టాల్లో ఉండి, మానసిక వేదనతో ఆసరా కోసం పోలీస్ స్టేషన్ గడప తొక్కే ప్రజలతో వ్యవహరించాల్సిన పద్ధతి ఇదేనా?" అంటూ అధికారులను సజ్జనార్ నిలదీశారు. కొన్ని స్టేషన్లలో రిసెప్షనిస్టులు, పరిపాలనా బాధ్యతలు చూసే అడ్మిన్ ఎస్సైల ప్రవర్తన సరిగా లేదని, సమయపాలన కూడా పాటించడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పర్యవేక్షణ లోపించినందుకు కొందరు ఇన్‌స్పెక్టర్లకు ఇప్పటికే ఛార్జిమెమోలు జారీ చేసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిగ్గు తేల్చేందుకు సీపీ సజ్జనార్ ఒక వినూత్న వ్యూహాన్ని అమలు చేశారు. ఆయన స్వయంగా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారు. కొందరు పోలీసు అధికారులనే సాధారణ పౌరులుగా, సివిల్ డ్రెస్‌లో ఫిర్యాదులు చేసేందుకు నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు పంపించారు.

## ప్రైవేట్ కాలేజీలకు తెలంగాణ హైకోర్టులో స్వల్ప ఊరట

తెలంగాణ హైకోర్టులో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలకు స్వల్ప ఊరట దక్కింది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9లోని కొన్ని మార్గదర్శకాలపై స్టే విధించింది. వచ్చే మంగళవారం వరకు స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విచారణ సందర్భంగా ప్రభుత్వానికి హైకోర్టు పలు ప్రశ్నలను సంధించింది. మీరు బకాయిలు చెల్లించరు, విద్యార్థుల నుంచి కళాశాలలను ఫీజులు వసూలు చేయవద్దంటే వారు ఎలా నడుపుతారని కోర్టు ప్రశ్నించింది. అలానే ఫీజు రీయింబర్స్మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారని అడిగింది. బడ్జెట్ సెషన్ కూడా అయిపోయినట్టు ఉందని, ఇంకా బకాయిలు ఎందుకు రిలీజ్ చేయలేదని ప్రభుత్వాని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. పెండింగ్ బకాయిలు ఎప్పటి లోగా చెల్లిస్తారో తెలపాలని పేర్కొంది. ఈ ఏడాది ఆగస్టు15 లోపు బకాయిలు అన్ని క్లియర్ అవుతాయన్న ప్రభుత్వ తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలియజేశారు. ఆగస్టు 15 లోపు బకాయిలు క్లియర్ అయితే ఆరోజే మా పిటిషన్లను వెనక్కి తీసుకుంటామని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు కోర్టుకు తెలిపాయి. మరోవైపు విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వానికి, కాలేజ్ యాజమాన్యాలకు మధ్య విద్యార్థులు నలిగిపోతు న్నారని వారి తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

## మూడు రాష్ట్రాల రైతులకు కొత్త ఆశ.. తుంగభద్ర వద్ద రేవంత్ కీలక సందేశం

ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం గేట్ల పునరుద్ధరణను కేవలం ఇంజినీరింగ్ విజయంగా చూడలేమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని కరవు ప్రభావిత ప్రాంతాలకు ఇది కీలక మైలురాయిగా మారుతుందని చెప్పారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలైన కర్నూలు, అనంతపురంతో పాటు తెలంగాణలోని పాలమూరు ప్రాంత ప్రజలు ఎదుర్కొన్న నీటి కష్టాలు తనకు బాగా తెలుసన్నారు. రాష్ట్రాల మధ్య నీటి పంపకాల అంశాలు సకాలంలో పరిష్కారం కాకపోవడం వల్ల విలువైన జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలు, వివాదాలు పక్కనబెట్టి రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. తుంగభద్ర వేదికగా మూడు రాష్ట్రాల మధ్య జరుగుతున్న చర్చలు సానుకూల దిశగా సాగుతున్నాయని సీఎం తెలిపారు. ఇదే స్ఫూర్తితో కృష్ణా, గోదావరి నదీ జలాల పంపకాల సమస్యలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన కీలక అంశాన్ని కూడా సీఎం ప్రస్తావించారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి చట్టబద్ధంగా రావాల్సిన 10 టీఎంసీల నీరు ఇప్పటికీ రాష్ట్రానికి పూర్తిగా అందడం లేదని పేర్కొన్నారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) పరిధిలోని తెలంగాణ రైతులకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో పొరుగు రాష్ట్రాలు సహకార భావంతో వ్యవహరించాలని కోరిన సీఎం, పరస్పర అవగాహనతో ముందుకు సాగితేనే మూడు రాష్ట్రాల రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు.

## రైతులెవరూ భయపడొద్దు.. అందరికీ యూరియా అందిస్తాం

జులై నెలలోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని రైతులందరికీ కలిపి రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారన్నారు. ఈ సభకు రైతు ఆశీర్వాద సభగా రైతులే నామకరణం చేశారని తెలిపారు. భారత దేశంలో అత్యధికంగా పంటలు పండించిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి అన్నారు. వ్యవసాయ రంగంలో పంటమార్పిడి విధానంలో ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. భవిష్యత్తులో పది వేల ఎకరాలను రైతులు సాగు చేసే విధంగా సహకారం అందజేస్తున్నామని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే అత్యధిక ఆయిల్ ఫాం సాగు జరుగుతోందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేశామని అన్నారు. ఏడాదికి పది వేల కోట్లు నష్టం వచ్చినప్పటికీ కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏడు రకాల వరి అందుబాటులో ఉందని రైతాంగానికి తుమ్మల తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా ఉంచుతున్నారని... నిల్వ చేసి అధిక ధరలకు అమ్మేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ కూడా భయపడవద్దని.. అందరికీ యూరియా అందిస్తామని స్పష్టం చేశారు. యూరియా కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చామని.. అందులో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. యూరియా కోసం తెచ్చిన యాప్ దేశానికే ఆదర్శమని ప్రధాని మోదీ కూడా ప్రశంసించే పరిస్థితి ఉందన్నారు. రైతాంగం పాడి పంటపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. అత్యధికంగా పురుగుల మందులు వాడుతున్నారని ఇక్కడి పంటలను విదేశాలు రిజెక్ట్ చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం కష్టంలో ఉందని, నిధుల కొరత ఉందని అయినా రైతాంగానికి అండగా ఉండాలని అప్పుచేసి మరీ రైతుభరోసా ఇస్తున్నామని చెప్పారు. ఈనెల 28న రైతు ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. 28, 29 రెండు రోజుల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సభా ప్రాంగణంలో అందుబాటులో ఉంటారన్నారు. 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## వెనెజువెలా భూకంపాన్ని ముందే హెచ్చరించిన స్మార్ట్ ఫోన్లు!

ఆ మాటలను వెనెజువెలాలో జరిగిన భూకంప సంఘటన నిరూపించింది. ఈ పెను భూకంపం సంభవించడానికి కొన్ని సెకన్ల ముందే గూగుల్ పలు ఆండ్రాయిడ్ మొబైల్స్ అలర్ట్ పంపినట్లు తాజాగా తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన స్క్రీన్ షాట్లను నెటిజన్లు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. 'భూకంపం వస్తోంది.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి' అంటూ గూగుల్ పంపిన అలర్ట్ మెసేజ్ చూసి ప్రజలు వెంటనే అప్రమత్తమయ్యారు. తీవ్రమైన ప్రకంపనలు మొదలయ్యేలోపే సురక్షిత ప్రాంతాలకు చేరుకోగలిగారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఈ అలర్ట్ వచ్చినట్లు సమాచారం.

**గూగుల్ భూకంపాన్ని ఎలా పసిగట్టిందంటే..**

గూగుల్ సంస్థ భూకంపం వస్తుందని ముందుగా జోస్యం చెప్పలేదు. కేవలం భూమి పొరల్లో మొదలైన తొలి ప్రకంపనల సంకేతాలను అత్యంత వేగంగా గుర్తించి ఆ ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేసింది. గూగుల్ రూపొందించిన 'ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్స్ సిస్టమ్' ద్వారా ఇది సాధ్యమైంది. ప్రస్తుతం వినియోగంలో ఉన్న స్మార్ట్‌ఫోన్లలో 'మోషన్ సెన్సార్లు' (యాక్సిలెరో మీటర్లు) ఉంటాయి. భూమిలో వచ్చే అతి సూక్ష్మమైన కదలికలను కూడా ఇవి గుర్తిస్తాయి. ఒకే ప్రాంతంలో వేలాది ఫోన్లు ఇలాంటి కదలికలను ఒకేసారి నమోదు చేసినప్పుడు, గూగుల్ క్లౌడ్ నెట్‌వర్క్ దానిని భూకంపంగా గుర్తించి, వెంటనే ఆ ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు పంపుతుంది.

**రెండు రకాల అలర్ట్‌లు..**

భూకంప తీవ్రతను అంచనా వేసినదాని బట్టి.. స్మార్ట్ ఫోన్లు రెండు రకాల హెచ్చరికలు ఇస్తుంటాయి. ఒకటి 'బి అవేర్ అలర్ట్'. ఇది తక్కువ తీవ్రతతో ప్రకంపనలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు ఇచ్చే సంకేతం. ఇక రెండోది 'టేక్ యాక్షన్ అలర్ట్'. మధ్యస్త, తీవ్ర స్థాయి భూకంపాల సమయంలో దీనిని జారీ చేస్తుంటుంది. దీన్ని టచ్ చేయగా.. భూకంపం వచ్చే అవకాశం ఉన్న పరిధిని చూపిస్తుంది. దీంతో పాటు విపత్తు సమయంలో సురక్షితంగా ఎలా బయటపడాలో తెలిపే కొన్ని సూచనలు, సలహాలు ఇస్తుంది. ప్రతి ఒక్కరి చేతిలో ఉండే స్మార్ట్‌ఫోన్‌లు ప్రస్తుతం విపత్తుల వేళ రక్షణ కవచాలుగా మారుతున్నాయి. వెనెజువెలా ప్రజలకు ఫోన్లు పంపిన ఆ కొన్ని సెకన్ల ముందస్తు హెచ్చరికే భారీ ప్రాణ నష్టం జరగకుండా నివారించిందని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వాలు, టెక్నాలజీ సంస్థలు కలిసి పనిచేస్తే భవిష్యత్తులో విపత్తుల ద్వారా జరిగే నష్టాన్ని భారీగా తగ్గించవచ్చని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

## తెలంగాణ వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రారంభం

'ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ' పేరుతో నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వేను ప్రారంభించింది. ఈ ప్రక్రియ ద్వారా తప్పులు లేని, కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) వారం రోజుల పాటు ప్రతి ఇంటికీ వెళ్లి ముందుగా ముద్రించిన ఓటరు ఫారాలను పంపిణీ చేస్తారు. ఈ ఫారాలు ఒరిజినల్, డూప్లికేట్ కాపీలతో ఉంటాయి. ఓటర్లు తమకు అందిన ఫారంలోని ఒరిజనల్ కాపీలో వివరాలను నింపి, బీఎల్‌ఓలు రెండోసారి వచ్చినప్పుడు వారికి అందజేయాలి. ఫారం స్వీకరించిన తర్వాత బీఎల్‌ఓలు ఓటర్లకు రసీదు ఇస్తారు. డూప్లికేట్ కాపీని ఓటర్లు తమ వద్ద ఉంచుకోవాలి. సర్వే సమయంలో ఇళ్లకు తాళాలు వేసి ఉంటే, ఫారమ్‌ను తలుపు వద్ద ఉంచి వెళ్తారు. ఓటరు అందుబాటులో లేకపోతే, కుటుంబంలోని పెద్దవారికి ఫారం అందజేస్తారు. ప్రతి బీఎల్‌ఓ సుమారు 800 నుంచి 1,000 మంది ఓటర్ల వివరాలను పర్యవేక్షిస్తారు.

**ఆన్‌లైన్ సేవలు, కీలక సూచనలు**

ఓటర్లు తమ వివరాలను ఆన్‌లైన్‌లో కూడా సరిచేసుకోవచ్చని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈసీఐ యాప్ ద్వారా గానీ, voters.eci.in వెబ్‌సైట్‌లో గానీ ఫారాలను సమర్పించవచ్చని సూచించారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన ఫారాలు నేరుగా సంబంధిత పోలింగ్ స్టేషన్ లేదా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ)కు చేరుతాయి. ఒకవేళ బీఎల్‌ఓలు ఇంటికి రాకపోయినా, ఫారం అందకపోయినా.. ceotelangana.nic.in వెబ్‌సైట్ లోని ఫోన్ నంబర్ల ద్వారా లేదా 'బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌ఓ' సదుపాయం ద్వారా వారిని సంప్రదించవచ్చు. ఈ సర్వే సందర్భంగా ఓటర్ల నుంచి ఎలాంటి పత్రాలు సేకరించబోమని అధికారులు స్పష్టం చేశారు.

**90 లక్షల ఓట్లలో లోపాల వల్లే..**

రాష్ట్రంలో మొత్తం 3.38 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో దాదాపు 90 లక్షల మంది ఓటర్ల వివరాల్లో కొన్ని లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భారీ వ్యత్యాసాల నేపథ్యంలోనే జాబితాను పూర్తిస్థాయిలో సరిదిద్దేందుకు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ బృహత్తర ప్రక్రియ కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 36,000 మంది బీఎల్‌ఓలను నియమించారు. వీరి పనితీరును పర్యవేక్షించేందుకు 3,500 మంది సూపర్‌వైజర్లు, వారిపైన 1,000 మందికి పైగా సీనియర్ అధికారులు ఉంటారు.

**ముఖ్యమైన తేదీలు**

సర్వే ముగింపు: జులై 27 , ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ: జులై 31 , అభ్యంతరాల స్వీకరణ: జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు , అభ్యంతరాల పరిష్కారం: జులై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు , తుది ఓటర్ల జాబితా ప్రచురణ: అక్టోబర్ 1 .

## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే

అధికారంలోకి వచ్చిన తర్వాత అదే రంగాన్ని పూర్తిగా దెబ్బతీశారని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు రూ.కోటి పలికిన ఎకరం భూమి ప్రస్తుతం రూ.50-60 లక్షలకు కూడా కొనుగోలుదారులు దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. రియల్ ఎస్టేట్ పై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది ఉపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ చెప్పారు. షాబాద్ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసి మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్స్‌పన్ వంటి అంతర్జాతీయ సంస్థలను తీసుకొచ్చామని చెప్పారు. పరిశ్రమల విస్తరణతో ఒకప్పుడు రూ.30 లక్షలు ఉన్న ఎకరం భూమి విలువ రూ.3 కోట్లకు చేరిందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా ఎన్నికల హామీల్లో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని కేటీఆర్ విమర్శించారు. రైతు బంధు, దళిత బంధు, ఇందిరమ్మ ఇళ్లు, అసైన్డ్ భూముల పట్టాల అంశాల్లో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వ అప్పులపై విమర్శలు చేసే కాంగ్రెస్ నేతలు తమ పాలనలో చేసిన అప్పుల లెక్కలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల కోసమే ఖర్చయ్యాయని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే 2028లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు. పార్టీ సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# సంపాదకీయం


## పశుపతి దేవుని ముద్రిక.. భారతదేశీయమే

భారతీయ సంస్కృతి చాలా కాలం నుంచి ఉందని తేల్చే చిహ్నం పశుపతి దేవుని ముద్రిక అని భారత ప్రభుత్వ సాంస్కృతిక విభాగం తెలిపింది. దానికి ఆధారంగా ఒక ముద్రికను చూపింది. అమెరికన్ చరిత్రకారిణి ఆడ్రీ ట్రుష్కే ఆ ముద్రిక శివునిది కాదని, యూరేషియాకు చెందిన లార్డ్ ఆఫ్ యానిమల్స్‌ది అని చెప్పారు. ఇరాన్‌కు చెందిన ప్రోటో ఎలమైట్ కళాఖండాలతో దీనికి పోలిక ఉందని అన్నారు. చుట్టూ పశువులు, మధ్యలో మనిషి ఉండడమనే పోలికను ఆమె చూపుతున్నారు. కానీ, ఈ ముద్రిక భారతీయ సంస్కృతికి చెందినదేనని చెప్పడానికి కొన్ని ఆధారాలు ఉన్నాయి. ఈ మూర్తి మూల బంధాసనంలో ఉన్నాడు. మూల బంధాసనం యోగాసనాల్లో ముఖ్యమైన ఆసనాల్లో ఒకటి. యోగం ఉపనిషత్తుల్లో ఉంది. యోగ శాస్త్రాన్ని పతంజలి రచించాడు. హఠయోగ ప్రదీపిక వంటి అనేక యోగ గ్రంథాలు భారతీయ సంస్కృతిలో ఉన్నాయి. ఈ మూర్తికి మూడు శిరస్సులున్నాయి. సంస్కృతంలో, సాహిత్యంలో మూడు తలలు కలవాళ్లు ఇద్దరే. ఒకడు త్రిశిరుడు. ఇతడు రుద్రుని పరివారంలోని జ్వర దేవత. త్రిశిరునికి మూడు పాదాలుంటాయి. ఈ మూర్తికి రెండే పాదాలున్నాయి. కనుక, ఇతడు త్రిశిరుడు కాదు. మరొకరు దత్తాత్రేయుడు. ఆయన యోగి. అలాగే, ఈ మూర్తి మూల బంధాసనంలో ఉన్నాడు. బలమైన ఈ రెండు ఆధారాలతో ఈ మూర్తి దత్తాత్రేయుడని చెప్పవచ్చు. యోగం ఏకాంతంలో చేస్తారు కనుక అడవి వంటి ప్రాంతంలో యోగం చేస్తున్నాడు. కావున అక్కడ జంతువులు ఉన్నాయని చెప్పవచ్చు. కాబట్టి ఈ ముద్రిక సనాతన ధర్మ సంస్కృతికి చెందిన దత్తాత్రేయునిదని చెప్పవచ్చు. ఈ ముద్రికపై 'అముష్యదదామి' (ఇతనికి ఇచ్చుచున్నాను) అని తెలిపే ఆరు చిత్రలిపి వర్ణాలున్నాయి. ఈ లిపిని కుడి వైపు నుంచి ఎడమ వైపునకు చదువుతారని పరిశోధకులు చెబుతారు. సంస్కృతంలో కుడి వైపు నుంచి ఎడమ వైపునకు చదివే పద్ధతి సంఖ్యలలో ఇప్పటికీ మిగిలి ఉంది. అష్టోత్తర శతమ్ అంటాం. అంటే, నూట ఎనిమిది అని అర్థం. కుడి వైపున నూరును తెలిపే శతమ్, ఎనిమిదిని తెలిపే అష్ట ఎడమ వైపున రాస్తారు. ఇతడు పరబ్రహ్మ మూర్త రూపమని తెలుస్తోంది. దత్తుడు పుంలింగం. పరబ్రహ్మ నపుంసక లింగం. అముష్య అనే పదానికి పుంలింగం, నపుంసక లింగం రెండూ ఉన్నాయి. అముష్య షష్ఠీ విభక్త్యంత పదం. షష్ఠీ విభక్తికి సంబంధమని అర్థం. ఇతడిది ఇతనికే సమర్పిస్తున్నాననే విశిష్ట భావం దీనిలో ఉంది. 'త్వదీయమేవ, తుభ్యమేవ సమర్పయే' అనే సంస్కృత వాక్యం ఈ భావాన్నే వెల్లడిస్తుంది. సర్వం ఈశ్వరునిదే. ఆయనది ఆయనకే సమర్పిస్తున్నాననే భావం. ఇలాంటి చిత్ర లిపి పదాలను సుమారు 200 దాకా చదవడం జరిగింది. సింధు సంస్కృతి చిత్రాలలో సుమారు నూరు చిత్రాలు వైదిక సంస్కృతికి చెందినవని వివరించడం జరిగింది. దానిని ఇక్కడ రాస్తే పెద్ద గ్రంథమవుతుంది. పై ఆధారాలు ఈ ముద్రిక ప్రాచీన భారత సంస్కృతికి సంబంధించినదని, అది ఆర్య ద్రావిడ సంస్కృతుల ఏకత్వాన్ని వెల్లడించేదని తెలుపుతున్నాయి. పశుపతి దేవుని ముద్రిక వేరే ఉంది. దానిలో మధ్య రుద్రుడున్నాడు. ఆయన తలపై గంగా ప్రవాహం ఉంది. వీటి ఆధారంగా ఇది రుద్రుని రూపమని తెలుస్తోంది. రుద్రునికి ఎడమ పక్కన 'ఓం' అనే ప్రణవ చిత్రం, దానిపైన మేఘం, దాని వెనక చుక్కలు ఉన్నాయి. శివుని శిరస్సుపై జుట్టు లేదు. ఆయనకు వస్త్రాలు కనబడడం లేదు. ప్రణవానికి పైన ఒక భాగంలో చెరిగిన డమరుకము, దానికి పక్కన గొడ్డలి, దాని పక్కన రెండు చిత్రలిపి వర్ణాలున్నాయి. దాని కింద ఏనుగు, దాని కింద మానవుడు, దాని కింద వ్యాఘ్ర మృగ శిరస్సు, దాని కింద పెద్ద బాణం, రుద్రుని కింద పశువు ఉన్నాయి. రుద్రుని భుజాలకు, ముంజేతులకు అలంకారాలు ఉన్నాయి. వీటన్నిటికీ ఆధారాలు రాస్తే పెద్ద వ్యాసమవుతుంది. అందుకే, కొన్ని చూపుతాను. దీనిని మూడు తలల పశుపతి దేవుని ముద్రిక అని రొమిల్లా థాపర్ (తరతరాల భారత చరిత్ర-- 21పుట) రాశారు. కొందరు రెండు కొమ్ములున్నాయని (చరిత్రలో మతాలు-- 2వ పుట) చెప్పారు. కానీ, ఈ ముద్రికలో మూడు తలలు, రెండు కొమ్ములు లేవు. ప్రణవం ఈశ్వరుని పేరు అని పతంజలి ముని యోగశాస్త్రంలో ఉంది. ప్రణవం పరమాత్మునికి ప్రతీక అని ఉపనిషత్తుల్లో ఉంది. రుద్రుని వర్ణనలలో అలంకారాలు ఉన్నాయి. 'శాంతం పద్మాసనస్థం..' అనే శివ ధ్యాన శ్లోకంలో నానాలంకారయుక్తం, పరశుమభయదం (గొడ్డలి) శివునికి ఉన్నాయని వర్ణించారు. శివునిపైన చేప బొమ్మ, బ వంటి ఆకారం కలిగిన రెండు చిత్రలిపి వర్ణాలు ఉన్నాయి. అవి శమీ అనే పదం సూచిస్తాయి. శమము కలవాడు అంటే శాంతుడు అని అర్థం. పై శ్లోకంలో శాంతం అని ఉంది. అంటే, శాంతుడనే అర్థం. శివాష్టోత్తర శతనామ స్తోత్రంలో గంగాధర: (శ్లో--6), వ్యోమకేశ:, దిగంబర: (12 శ్లో), కవచీ (కవచం కలవాడు) అనే నామాలున్నాయి. శివ సహస్రంలో గజేశ్వర: (ఏనుగులకు అధిపతి (148 శ్లో)) అనే నామం ఉంది. నరర్షభ: (మానవ శ్రేష్ఠుడు, 148 శ్లో). ఈ నామాలకు చిత్రాలు పశుపతి దేవుని ముద్రికలో ఉన్నాయి. రుద్రుని వాహనం పశువు. పై ముద్రికలో పశుపతి దేవుని చిత్రం కింద పశువు చిత్రం ఉంది. మహాభారతంలో శివ సహస్రంలో ముండ: (జుట్టు లేనివాడు, 45 శ్లో), దిగ్వాసా: (దిగంబరుడు, 42 శ్లో), జ్యోతిషామయనం (చుక్కలకు ఆధారమైనవాడు, 57 శ్లో), మహా మేఘ నివాసీ (గొప్ప మేఘమునందు నివసించువాడు, 82 శ్లో), వ్యక్తావ్యక్త: (వ్యక్తముగా, అవ్యక్తముగా ఉన్నవాడు, 124 శ్లో) అనే నామాలున్నాయి. ఈ ముద్రికలో దీనికి అనుగుణమైన చిత్రాలున్నాయి. ముద్రికలో రుద్రుని సగం రూపం చిత్రించారు. ఇది వ్యక్తావ్యక్తతను తెలుపుతోంది. అలాగే, ఈ పశుపతి కవచం తొడుక్కుని ఉన్నాడు. కృష్ణ యజుర్వేదంలో రుద్రునికి నమస్కరించే మంత్రాల్లో 'కవచం కల రుద్రునికి నమస్కారం' అనే మంత్రం ఉంది (4 అ. 5 ప్ర. 6 అను). పశుపతి తలపై గంగ ఉంది. రుద్రునికి గంగాధరుడని పేరు ఉంది. స్వర్గాన్నుంచి భూమికి దిగే గంగ మొదట శివుని శిరస్సుపైకి వచ్చి, తర్వాత భూమికి దిగిందనే వృత్తాంతం శ్రీమద్రామాయణంలో ఉంది (బా 43స. 8 శ్లో). రుద్రునికి కుడి వైపున మానవ చిత్రం ఉంది. రుద్రునికి ద్విజావతారం ఉంది (శివ పురాణం, శత రుద్ర సంహిత). రుద్రునికి ఎడమ వైపున పెద్ద పులి ముఖచిత్రం ఉంది. భద్రాయువనే రాజును పరీక్షించడానికి శార్దూల రూపం ధరించాడు శివుడు. రుద్రుడు వ్యాఘ్రచర్మం ధరించాడని రుద్ర వర్ణనలో కనబడుతుంది. రుద్రుని ఆసనం కింద ఒక పశువు ఉంది. ఈ రుద్రుని పశుపతి అని వ్యవహరిస్తున్నారు. రుద్రునికి పశుపతి అనే పేరు వేదంలో ఉంది. (తైత్తిరీయ సంహిత 4--5--8 అను) ఈ మూర్తి మోచేతి నుంచి ముంజేతి వరకూ కవచాలు తొడుక్కున్నాడు. వీటికి హస్తఘ్నాలని పేరు. ఇవి వేదంలో ఉన్నాయి (తైత్తిరీయ సంహిత 4--6--6 అను).

# ప్రతిఘటన పథంలో 'ఇండియా'






ప్రతిఘటన. జూన్ 8న 'ఇండియా కూటమి' (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్) అంతర్గత సమావేశంలో రాహుల్‌గాంధీ వెలువరించిన స్ఫూర్తిదాయక ప్రసంగం సారాంశాన్ని సంగ్రహపరిచిన పదమది. 'కాంగ్రెస్ పార్టీ ఒక ప్రతిఘటన ఉద్యమం' అని రాహుల్ ఉద్ఘాటించారు. ఈ వ్యాఖ్యను ప్రస్తుత కాంగ్రెస్ కార్యకలాపాల వాస్తవికత గురించిన ప్రకటనగా కాకుండా గతించిన తరాల వారిని ఎంతగానో ఉత్తేజపరిచిన ఒక ఆదర్శాన్ని పునరుద్ధరించి ఔదలదాల్చే సంకల్పంగా భావించాలి. వర్తమాన భారత ప్రజాస్వామ్యాన్ని పీడిస్తున్న సమస్యల గురించి ఆయన చేసిన నిశిత విశ్లేషణ, వాటిని అధిగమించేందుకు సూచించిన పరిష్కార మార్గాలే రాహుల్ ప్రసంగ విశిష్టతలు. అవి మౌలికమైనవి, కనుక సార్థకమైనవి. జాతి రాజకీయ జీవితంలో నిర్ణయాత్మక మార్పులు చోటుచేసుకుంటున్న తరుణమిది: పోటీతత్వ నిరంకుశత్వం (కాంపిటీటివ్ అథారిటేరియనిజం) నుంచి ఏకపక్ష ఆధిపత్యం (ఎలెక్టోరల్ ఆటోక్రసీ) భారత గణతంత్ర రాజ్య రాజకీయాలు పరివర్తన చెందుతున్న కీలక సందర్భంలో నేడు మనం ఉన్నాం. రాహుల్ ప్రసంగం దేశ రాజకీయాలలో రావాల్సిన ఒక వ్యూహాత్మక మార్పును కూడా స్పష్టంగా, తార్కికంగా ప్రకటించింది: ఎన్నికల పోటీ రాజకీయాల నుంచి ప్రతిఘటనాత్మక రాజకీయాలకు ప్రతిపక్షాలు పరివర్తన చెందాలి. ఈ ప్రకటనలోని ప్రధాన భావాలను చర్చించాలి, మెరుగుపరచాలి, సులభగ్రాహ్యం చేయాలి, ప్రజలలో వ్యాపింపజేయాలి. ఇది నేటి రాజకీయ కర్తవ్యాలలో ముఖ్యమైనది. భారత ప్రభుత్వ యంత్రాంగాలు అన్నిటినీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్వాధీనం చేసుకున్నదని రాహుల్ తన ప్రసంగంలో నిశితంగా విశ్లేషించారు. మీడియా, సోషల్ మీడియా, న్యాయ వ్యవస్థ, బ్యూరోక్రసీ దర్యాప్తు, గూఢచర్య సంస్థలు సమస్తమూ ప్రస్తుత ప్రభుత్వాన్ని ఎప్పటికీ అధికారంలో ఉంచేందుకు దీక్షాదక్షతలు చూపుతున్నాయని ఆయన గర్హించారు. ఈ పరిస్థితి మరింతగా అధ్వానమవుతోందని ఆయన స్పష్టంగా చెప్పారు. 'ఇంతవరకు తమ రాజ్యాంగ విధులను ఎలాగోలా సక్రమంగా నిర్వర్తిస్తున్న ప్రభుత్వ సంస్థలు సైతం సమీప భవిష్యత్తులోనే అలా పనిచేయడాన్ని నిలిపివేస్తాయి. కారణమేమిటి? భారత రాజ్య వ్యవస్థపై బీజేపీ, ఆరెస్సెస్‌లు తమ పట్టును ఎటువంటి మినహాయింపు లేకుండా సంపూర్ణంగా బిగిస్తాయని రాహుల్ అన్నారు. భారత ప్రజాస్వామ్యంలోని తిరోగమన పోకడలు, ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య వ్యవస్థల పతన రీతులను ప్రతిబింబిస్తున్నాయని రాజనీతి శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ పతనం రాత్రికిరాత్రే సంభవించినది కాదని మనకు తెలుసు. ప్రజాస్వామ్యం అంటే 'సంస్థాగత అనిశ్చితి' అని పోలిష్--అమెరికన్ రాజనీతి శాస్త్రవేత్త ఆడమ్ ప్రెవోర్స్కి సుప్రసిద్ధంగా నిర్వచించారు. ప్రజాస్వామ్యం అంటే పార్టీలు ఎన్నికలలో ఓడిపోయే వ్యవస్థ అని, అధికారాన్ని కోల్పోయే అపాయాన్ని పాలకులు అంగీకరించే విధానమే ప్రజాస్వామ్యమని ఆయన విశదీకరించారు. అధికారాన్ని కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకే పాలకులు రాజ్యాంగ వ్యవస్థల స్వతంత్రతను తగ్గించి వాటిని తమకు అనుకూలంగా చేసుకుంటున్నారు. తత్ఫలితంగా ప్రజాస్వామ్యం తిరోగమిస్తోంది. ప్రజాస్వామ్య తిరోగమనంలో రెండు మధ్యంతర దశలు ఉన్నాయి. మొదటిది-- పోటీతత్వ నిరంకుశత్వం. ఈ నిరంకుశత్వ పాలనా విధానం బహుళ పార్టీల ఎన్నికలను నిర్వహిస్తుంది. అధికారంలో ఉన్న వారు పరిస్థితులను ఎలాగైనా సరే పూర్తిగా తమకు అనుకూలంగా మలుచుకుంటారు. అధికారానికి పార్టీల మధ్య పోటీ ఉంటుంది. అయితే అది ప్రాథమికంగా అసమమైనది, అన్యాయమైనది. ఈ దృష్ట్యా ఇది నిజమైన ప్రజాస్వామ్యం కాదు. ఇక రెండోది-- ఏకపక్ష ఆధిపత్యం. ఈ వ్యవస్థలో క్రమం తప్పకుండా బహుళ పార్టీ ఎన్నికలు జరుగు తుంటాయి. అయితే ఆ ఎన్నికలు నామమాత్రమైనవే. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన పౌర స్వేచ్ఛలు ఉండవు. పోటీ చేసే రాజకీయ పక్షాలకు సమాన అవకాశాలు ఉండవు. పాలకులు తమ ప్రయోజనాలు కాపాడుకోవడానికి నిర్నిబంధంగా అధికార దుర్వినియోగానికి పాల్పడతారు. నియంతృత్వ పాలనకు చట్టబద్ధత కల్పించేందుకు మాత్రమే ఈ ఎన్నికలు ఉపయోగపడతాయి. భారత్ ప్రస్తుతం ఈ రెండు దశల మధ్య ఉన్నది. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం మన దేశం ఒక నిరంకుశత్వ పాలనా రాజ్యంగా పరిణమించింది. ఏకపక్ష ఆధిపత్యంలోకి భారత్ పతనాన్ని 2024 సార్వత్రిక ఎన్నికలలో ప్రజా తీర్పు నిలువరించింది. దేశ పాలకులు ఆనాటి నుంచీ ఏ ఎన్నికలలోనూ పరాజయం పాలవ్వకుండా ఉండేందుకు చేయని ప్రయత్నమేదీ లేదు. అందులో భాగంగా మీడియా ద్వారా సమాచారాన్ని నియంత్రిస్తున్నారు; ప్రభుత్వ అధికారాలను ఉపయోగించుకుని ఆర్థిక వనరులను అపారంగా సమకూర్చుకుంటున్నారు; ప్రభుత్వ సంస్థలు, రాజ్యాంగ వ్యవస్థలను పూర్తిగా తమ అదుపులోకి తీసుకున్నారు. ఇలా సమస్త సమాజంపై అసాధారణ గుత్తాధిపత్యం ద్వారా సంభావ్య రాజకీయ నష్టాలను సాధ్యమైనంత వరకు తగ్గించుకుంటున్నారు లేదా నివారించుకుంటున్నారు. వీటి ద్వారా తమకు ఏర్పడిన అనుకూలతలను మరింతగా పెంపొంది ంచుకునేందుకై ఎన్నికల వ్యవస్థకు పునఃరూపకల్పన చేస్తున్నారు: నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియల ద్వారా దేశ రాజకీయ భౌగోళిక స్వరూపాన్ని మార్చివేసేందుకు పూనుకున్నారు; పంచాయత్ నుంచి పార్లమెంటు దాకా సమస్త ప్రజాప్రాతినిధ్య సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడమనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అనే నినాదంతో ఆ లక్ష్య పరిపూర్తికి ప్రజల ఆమోదాన్ని సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు; మరీ ముఖ్యంగా ఓటర్ జాబితాల సమగ్ర ప్రత్యేక సవరణ ద్వారా ఎన్నికల వ్యవస్థను ఎటువంటి మినహాయింపులేకుండా తమకు అనుగుణంగా మార్చుకునేందుకు ప్రస్తుత పాలకులు చురుగ్గా కృషి చేస్తున్నారు. ఈ ప్రక్రియలన్నీ పూర్తయినప్పుడు మన ప్రజాస్వామ్యం పూర్తిగా ఏకపక్ష ఆధిపత్యంగా రూపొందుతుంది. ఎన్నికల ద్వారా సాధారణ ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఒక రాజకీయ పక్షం నుంచి మరో రాజకీయ పక్షానికి అధికారం బదిలీ అయ్యేందుకు చాలా చాలా తక్కువ అవకాశం మాత్రమే ఉంటుంది. నిక్కచ్చిగా చెప్పాలంటే అది పూర్తిగా ఉపేక్షణీయ అవకాశం. మన ప్రజాస్వామ్యం నేతి బీర చందమవుతుంది. ప్రతిపక్షాలు ఎట్టకేలకు ఈ కఠోర, నైరాశ్యపూరిత సత్యాన్ని గ్రహించాయి. దాన్ని ఎదుర్కోవడానికి సమకట్టాయి. రాహుల్ గాంధీ ప్రసంగం భారత ప్రజాస్వామ్యానికి వాటిల్లిన ప్రమాదాల విశ్లేషణకే పరిమితమైనది కాదు. అదొక ఉత్తేజకరమైన ఉపన్యాసం. ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేయడమేకాకుండా ధర్మ రక్షణకై చేపట్టాల్సిన రాజకీయ కార్యాచరణకు విస్పష్టమైన సూచనలు అందులో ఉన్నాయి. తత్కారణంగానే అది స్ఫూర్తిదాయకమైనది. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నిలబడే సంకల్పాన్ని మనలో జనింపజేసింది. మరి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్షాలు ఇప్పటిదాకా అనుసరిస్తున్న రాజకీయ పద్ధతులు సత్ఫలితాలనివ్వడంలో సఫలమవడం లేదు. ఎందుకని? రాజ్యాంగ వ్యవస్థలను నియంత్రిస్తున్న పాలకులు రాజ్యాంగం నిర్దేశించిన విధంగా ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు కల్పించడం లేదు. సమాన అవకాశాలు ఉన్నప్పుడు మాత్రమే ప్రజాస్వామిక రాజకీయ సాధనాలు ప్రభావశీలంగా ఉంటాయి. అటువంటి అవకాశాలు ప్రతిపక్షాలకు ఇంకెంత మాత్రం లేవు. రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న ప్రామాణిక రాజకీయ పద్ధతులు పని చేయనప్పుడు ఏది కార్యసాధకమవుతుంది? ప్రతిఘటన, అవును ప్రతిఘటనే అని రాహుల్ స్పష్టం చేశారు. ఎన్నికల రాజకీయాలపైనే ఎక్కువగా ఆధారపడడం ఇంకెంత మాత్రం శ్రేయస్కరం కాదని ఆయన గట్టిగా చెప్పారు. 'ప్రతిపక్షాలు ఎన్నికలలో గెలిచేందుకు అవి స్వేచ్ఛగా, సక్రమంగా జరగడం లేదు. కనుక మనం ప్రతిఘటన మార్గాన్ని అనుసరించాలి' అని రాహుల్ దృఢస్వరంతో చెప్పారు. ప్రతిఘటన ఒక స్ఫూర్తి కావాలి, ఒక మనోవైఖరిగా భాసించాలి అని రాహుల్ వక్కాణించారు. ప్రతిఘటన కేవలం సంస్థాగతంగా మాత్రమే ఉండకూడదు. అలా ఉన్న పక్షంలో దాని ప్రభావశీలత పరిమితమవుతుందని ఆయన అన్నారు. వివేకవంతమైన అంతర్దృష్టి ఇది, సందేహం లేదు. ప్రతిఘటన స్ఫూర్తి విశాల ప్రజానీకంలో మనసా, వాచా, కర్మణా వెలుగొందాలని ప్రతిపక్ష నాయకుడు ఆశించడం సూచిస్తున్నదేమిటి? ప్రతిపక్ష రాజకీయాలలో ఒక మౌలిక మార్పునే కాదూ? అవును, విపక్ష రాజకీయ కార్యాచరణ పార్లమెంటు నుంచి ప్రజా నిరసనలకు, ఎన్నికలలో పోటీ చేయడం నుంచి క్షేత్ర స్థాయిలో జన సమీకరణకు, అధికారాన్ని గెలుచుకునే రాజకీయాల నుంచి రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించిన మార్గంలోకి మన ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యాన్ని మళ్లీ తీసుకువెళ్లే రాజకీయాలకు మారాలి, మారితీరాలి. ఇది జరూరుగా జరగాలి. మనదైన ఒక ప్రజాస్వామిక పోరాటపథాన్ని మనం ఎంచుకోవాలి. తద్వారా మాత్రమే మన గణతంత్ర రాజ్యాన్ని సంకుచిత శక్తుల నుంచి విముక్తి చేయగలుగుతాము. ఈ చరిత్రాత్మక బాధ్యత కేవలం ఒక్క 'ఇండియా' కూటమిది మాత్రమే కాదు. చైతన్యశీల శక్తులు అన్నిటినీ సమ్మేళనపరచడం ద్వారా మాత్రమే ఆ బాధ్యతను సమర్థంగా, సార్థకంగా నిర్వహించడం సాధ్యమవుతుంది. ప్రతిఘటనకు ఇలా ప్రాధాన్యమివ్వడం రాజ్యాంగ విహిత, పార్లమెంటరీ పోరాట పద్ధతులను త్యజించాలని పిలుపునివ్వడం ఎంత మాత్రం కాదు. రాజకీయాలను అర్థవంతంగా, ఆచరణయోగ్యంగా మళ్లీ ప్రజలకు చేరువ చేసేందుకు అదొక అభ్యర్థన అన్న వాస్తవాన్ని గ్రహించాలి. ప్రజలు, ప్రతిపక్షాలు నిరంతరం ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నిస్తుండాలి. ప్రశ్నించడాన్ని, నిరసనలు తెలపడాన్ని మానివేస్తే వీధులు నిశ్శబ్దంగా ఉంటాయని, ప్రజల మౌనం పార్లమెంటు ఒక ధూర్త సంస్థగా మారిపోయేందుకు దారితీస్తుందని దశాబ్దాల క్రితం డాక్టర్ రామ్ మనోహర్ లోహియా హెచ్చరించారు. ప్రజాశ్రేయస్సు పట్ల చిత్తశుద్ధిలేని పార్లమెంటు ప్రజాస్వామిక పాలనకు ఎలా దోహదం చేస్తుంది?

# నిరుపయోగంగా గరిడేపల్లి బస్టాండ్..ఎండలోనే బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ

-నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రాని బస్టాండ్
-మహిళలు,వృద్ధులు,విద్యార్థుల ఇబ్బందులు
-వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికుల విజ్ఞప్తి



హంసకలం వార్త

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్టాండ్ వినియోగంలోకి రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బస్టాండ్ భవనం అందుబాటులో ఉన్నప్పటికీ బస్సులు అక్కడికి రాకపోవడంతోమహిళలు,వృద్ధులు,విద్యార్థులు,ఉద్యోగులు రోడ్డుపైనే ఎండలో, వర్షంలో నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ వందలాది మంది ప్రయాణికులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నప్పటికీ, బస్టాండ్ ప్రయోజనం వారికి అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా వేసవి ఎండలు,వర్షాకాలంలో వానలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్టాండును వెంటనే పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో పాటు తాగునీరు,కూర్చునే సౌకర్యం, పరిశుభ్రత వంటి మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రజాధనంతో నిర్మించిన బస్టాండ్ ప్రజలకు ఉపయోగపడేలా తక్షణ చర్యలు తీసుకోవాలని గరిడేపల్లి ప్రజలు,మహిళలు, విద్యార్థులు, ప్రయాణికులు అధికారులను కోరుతున్నారు.

# తెలంగాణలో చేయూత పింఛన్ల పథకంపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

-అనర్హులను గుర్తించే సర్వే ఈ నెలాఖరుతో ముగియనుంది
-వచ్చే నెల నుంచి అర్హులైన వారి మంజూరు కోసం దరఖాస్తులు
-దరఖాస్తులను పరిశీలించి అర్హులైనవారికి పింఛన్ల పంపిణీ
-ఈ నెలాఖరుకు సర్వే పూర్తి బ్యాంక్ అకౌంట్లలో నేరుగా జమ.




హంసకలం వార్త

తెలంగాణ ప్రభుత్వం కొత్త పింఛన్ల పంపిణీపై కీలక ప్రకటన చేసింది. కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నవారికి తీపికబురు అందించింది. వచ్చే నెల నుంచి కొత్త పింఛన్ల జారీ కోసం దరఖాస్తులను ఆహ్వానించనుంది. అటు అనర్హులను గుర్తించే సర్వే ఈ నెలాఖరుతో ముగియనుంది. తెలంగాణలో చేయూత పింఛన్ల పథకంపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త పింఛన్ల పంపిణీపై కీలక అప్డేట్ ఇచ్చింది. వచ్చే నెల నుంచి కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించాలని నిర్ణయించింది. అర్హులైనవారి నుంచి దరఖాస్తులు స్వీకరించనుంది. అనంతరం దరఖాస్తులను పరిశీలించి అర్హులైనవారికి పింఛన్లను పంపిణీ చేయనున్నారు. అర్హులైన ప్రతీఒక్కరికీ పింఛన్లు అందిస్తామని ప్రభుత్వం చెబుతోంది. గ్రామాలు, పట్టణాల్లో సెర్ప్ అధికారులు సర్వే చేపడుతున్నారు. ఈ క్రమంలో తమకు అర్హత ఉన్నా పింఛన్లు ఇవ్వడం లేదని వృద్ధులు దివ్యాంగులు ఒంటరి మహిళలు ఫిర్యాదు చేస్తున్నారు. తమకు పింఛన్లు అందించాలని వినతి పత్రాలు అందిస్తున్నారు.

-వచ్చే నెల నుంచి అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు

ఈ క్రమంలో అర్హులైనవారికి కొత్త పింఛన్లను మంజూరు చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. అయితే అనర్హులను గుర్తించేందుకు ప్రభుత్వం సర్వే చేపడుతోంది. ఈ సర్వే తుది దశకు చేరుకుంది. ఈ నెలాఖరుతో సర్వే ముగియనుండగా వచ్చే నెల నుంచి కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. కొంతమంది అర్హత లేకపోయినా పింఛన్ పొందుతున్నారు. అలాగే మరణించినవారు, వలస వెళ్లిపోయినవారు, వేరే ప్రాంతాల్లో స్థిరపడినవారు కూడా ఉన్నారు. దీని వల్ల నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, లబ్దిదారుల జాబితాలో అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో నిజమైన లబ్దిదారులకు మాత్రమే పింఛన్లు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థను రంగంలోకి దింపింది. ఈ సంస్థ లైవ్ అథెంటికేషన్ సర్వే చేపడుతోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి అనర్హులను గుర్తిస్తోంది.

-ఈ నెలాఖరుకు సర్వే పూర్తి బ్యాంక్ అకౌంట్లలో నేరుగా జమ.

రాష్ట్రంలో మొత్తం 42 లక్షల మంది పింఛన్లు పొందుతున్నారు. వీరిలో బ్యాంక్ అకౌంట్లలో నేరుగా పింఛన్లు పొందుతున్నవారు 19,04,239 మంది ఉన్నారు. వీరిలో 93,624 మందిని అనర్హులుగా గుర్తించింది. 40,751 మంది మరణించగా వీరి పేరిట ఇంకా నిధులు విత్ డ్రా అవుతున్నట్లు తేలింది. 41,689 మంది ఆచూకీ లభించడం లేదు. 3,495 మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా 11 వేల మంది ఆధార్లు చెల్లకపోగా వారి ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి. ప్రస్తుతం 15.97 లక్షల మంది సర్వే పూర్తి చేశారు. ఈ నెలాఖరు నాటికి 100 శాతం సర్వే పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పెన్షన్లలో పారదర్శకత తెచ్చేందుకు ఈ మెగా సర్వే చేపడుతున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. కాగా పింఛన్లను బ్యాంక్ అకౌంట్లలో నేరుగా జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు పోస్టాఫీసుల ద్వారా పింఛన్ల కోసం అందించేవారు.అయితే ఇక నుంచి నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని ఇటీవల అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు.

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను సమర్ధవంతంగా పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-ఓటరు జాబితా సవరణలో మొదటి దశను పకడ్బందీగా నిర్వహించాలి..
-ఇంటింటికీ వెళ్ళి ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించాలి..
-పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములు కావాలి..
-జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓకు వివరాలు నమోదు చేసిన వ్యక్తిగత ఎన్యుమరేషన్ ఫారమ్‌ను అందజేసిన జిల్లా కలెక్టర్...

హంసకలం వార్త

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే హౌస్-టు-హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరం 46వ డివిజన్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓ జిల్లా కలెక్టర్‌కు వ్యక్తిగత ఎన్యుమరేషన్ ఫారమ్‌ను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయంగా ఫారమ్‌లో వివరాలు నమోదు చేసి అధికారులకు తిరిగి సమర్పించారు. ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వహణ, ఫారమ్‌ల పంపిణీ, సేకరణ విధానాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హత గల ఓటరును గుర్తించి, వారి వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఎన్నికల సంఘానికి క్షేత్రస్థాయి ప్రతినిధులుగా వ్యవహరిస్తారని, వారి పని తీరుపైనే ఈ కార్యక్రమం విజయవంతం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసే సమయంలో ప్రజలకు తలెత్తే సందేహాలను నివృత్తి చేస్తూ, కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో మొదటి నాలుగు నుంచి ఐదు రోజులలోపు ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారమ్‌లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఫారమ్‌లను అందజేసే సమయంలో వాటిని పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, తదుపరి సందర్శనలో వాటిని సేకరిస్తామని స్పష్టం చేయాలని చెప్పారు. ఫారమ్‌లు సమర్పించని పక్షంలో సంబంధిత వ్యక్తుల పేర్లు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో కనిపించవని ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు లేదా ఫారమ్‌లు స్వయంగా నింపలేని వారికి బీఎల్ఓలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటరుకి తప్పని సరిగా ఎన్యుమరేషన్ ఫారమ్ అందేలా చూడాలని, ఇంట్లో లేని సందర్భాల్లో కనీసం మూడు సార్లు సందర్శించి ఫారమ్ అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఫారమ్ పంపిణీ జరిగినట్లు రసీదు లేదా ఇతర ఆధారాలు భద్రపరచుకోవాలని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో ఇప్పటికే పేరు ఉన్న అర్హులైన ఓటర్ల నుంచి ఈ దశలో ఎలాంటి సహాయక పత్రాలు తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఓటరు జాబితాను 2002 జాబితాతో మ్యాపింగ్ చేసి, వివరాలు ధృవీకరించి సంతకం తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. జూలై 31న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించిన వారి పేర్లు మాత్రమే ఉంటాయని, ఫారమ్‌లు ఇవ్వని వారి పేర్లు జాబితాలో కనిపించకపోవచ్చని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివాసం మారిన వారు, అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారు, కొత్తగా వచ్చిన నివాసితుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. ఇతర నియోజక వర్గాల్లో



ఓటర్లుగా ఉన్నవారిని ఫారమ్-8 ద్వారా ఓటు బదిలీ చేయించే చర్యలు చేపట్టాలని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి అర్హుడికి ఫారమ్-6 అందించి కొత్త ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎవరైనా ఓటరు మరణించినట్లు, నివాసం మార్చుకున్నట్లు లేదా అక్కడ నివసించడం లేదని సమాచారం వచ్చినప్పుడు తగిన ఆధారాలు, స్థానికుల వాంగ్మూలాలు నమోదు చేయాలని, సరైన ధృవీకరణ లేకుండా ఏ ఓటరు పేరును తొలగించరాదని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణలో పారదర్శకత, నిష్పాక్షికత తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొంటున్న బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు, ఈఆర్వోలు, రాజకీయ పార్టీల బీఎల్ఏలు రాబోయే మూడు నెలలపాటు ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరుని చేరుకుని వారి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ఈఆర్వోలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఫారమ్‌ల పంపిణీ నుంచి సేకరణ వరకు ప్రతి దశలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బీఎల్ఓలు తమ సాధారణ విధులతో పాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎస్ఐఆర్ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను సమర్ధవంతంగా పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
-ఓటరు జాబితా సవరణలో మొదటి దశను పకడ్బందీగా నిర్వహించాలి..
-ఇంటింటికీ వెళ్ళి ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించాలి..
-పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములు కావాలి..
-జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓకు వివరాలు నమోదు చేసిన వ్యక్తిగత ఎన్యుమరేషన్ ఫారమ్‌ను అందజేసిన జిల్లా కలెక్టర్...



హంసకలం వార్త

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే హౌస్-టు-హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరం 46వ డివిజన్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓ జిల్లా కలెక్టర్‌కు వ్యక్తిగత ఎన్యుమరేషన్ ఫారమ్‌ను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయంగా ఫారమ్‌లో వివరాలు నమోదు చేసి అధికారులకు తిరిగి సమర్పించారు. ఎస్ఐఆర్ కార్యక్రమ నిర్వహణ, ఫారమ్‌ల పంపిణీ, సేకరణ విధానాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హత గల ఓటరును గుర్తించి, వారి వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఎన్నికల సంఘానికి క్షేత్రస్థాయి ప్రతినిధులుగా వ్యవహరిస్తారని, వారి పని తీరుపైనే ఈ కార్యక్రమం విజయవంతం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసే సమయంలో ప్రజలకు తలెత్తే సందేహాలను నివృత్తి చేస్తూ, కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో మొదటి నాలుగు నుంచి ఐదు రోజులలోపు ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారమ్‌లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఫారమ్‌లను అందజేసే సమయంలో వాటిని పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, తదుపరి సందర్శనలో వాటిని సేకరిస్తామని స్పష్టం చేయాలని చెప్పారు. ఫారమ్‌లు సమర్పించని పక్షంలో సంబంధిత వ్యక్తుల పేర్లు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో కనిపించవని ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు లేదా ఫారమ్‌లు స్వయంగా నింపలేని వారికి బీఎల్ఓలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటరుకి తప్పని సరిగా ఎన్యుమరేషన్ ఫారమ్ అందేలా చూడాలని, ఇంట్లో లేని సందర్భాల్లో కనీసం మూడు సార్లు సందర్శించి ఫారమ్ అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఫారమ్ పంపిణీ జరిగినట్లు రసీదు లేదా ఇతర ఆధారాలు భద్రపరచుకోవాలని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో ఇప్పటికే పేరు ఉన్న అర్హులైన ఓటర్ల నుంచి ఈ దశలో ఎలాంటి సహాయక పత్రాలు తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఓటరు జాబితాను 2002 జాబితాతో మ్యాపింగ్ చేసి, వివరాలు ధృవీకరించి సంతకం తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. జూలై 31న ప్రచురించే డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఎన్యుమరేషన్ ఫారమ్‌లు సమర్పించిన వారి పేర్లు మాత్రమే ఉంటాయని, ఫారమ్‌లు ఇవ్వని వారి పేర్లు జాబితాలో కనిపించకపోవచ్చని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివాసం మారిన వారు, అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారు, కొత్తగా వచ్చిన నివాసితుల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని సూచించారు. ఇతర నియోజక వర్గాల్లో ఓటర్లుగా ఉన్నవారిని ఫారమ్-8 ద్వారా ఓటు బదిలీ చేయించే చర్యలు చేపట్టాలని తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి అర్హుడికి ఫారమ్-6 అందించి కొత్త ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎవరైనా ఓటరు మరణించినట్లు, నివాసం మార్చుకున్నట్లు లేదా అక్కడ నివసించడం లేదని సమాచారం వచ్చినప్పుడు తగిన ఆధారాలు, స్థానికుల వాంగ్మూలాలు నమోదు చేయాలని, సరైన ధృవీకరణ లేకుండా ఏ ఓటరు పేరును తొలగించరాదని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణలో పారదర్శకత, నిష్పాక్షికత తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొంటున్న బీఎల్ఓలు, సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు, ఈఆర్వోలు, రాజకీయ పార్టీల బీఎల్ఏలు రాబోయే మూడు నెలలపాటు ఈ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరుని చేరుకుని వారి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒక వ్యక్తికి ఒకే ఓటు ఉండేలా ఈఆర్వోలు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఫారమ్‌ల పంపిణీ నుంచి సేకరణ వరకు ప్రతి దశలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బీఎల్ఓలు తమ సాధారణ విధులతో పాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన ఎస్ఐఆర్ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి

**-బీ.ఎల్.వో.ల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్**



హంసకలం వార్త

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్)కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. గిత్యాల రూరల్ మండలం చల్ గల్ గ్రామంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్న కలెక్టర్, అధికారులు, బీఎల్‌వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, తహసీల్దార్ హకీమ్,సంబంధిత సిబ్బంది, బీఎల్‌వోలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు

**-అధికారం కోసం నియంతగా మారినా ఇందిరాగాంధీ**

**-ఎమర్జెన్సీ డే కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**




హంసకలం వార్త

భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో జూన్ 25 చీకటి రోజు అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఎమర్జెన్సీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 1971 ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఉత్తర ప్రదేశ్ లోని రాయ్ బరేలీ లో పోటీ చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. దీంతో అలహాబాద్ హైకోర్టు నాలుగు సంవత్సరాలు విచారించిన తర్వాత అధికార దుర్వినియోగం జరిగిందని తీర్పునిచ్చిందని చెప్పారు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలాగే ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయరాదని నిషేధం విధించిందన్నారు. కానీ ఇందిరా గాంధీ రాష్ట్రపతిని కలిసి అంతర్గత భద్రత కారణాన్ని చూపి ఎమర్జెన్సీ ప్రకటించడం జరిగిందన్నారు. ప్రతిపక్ష నేతలైన అటల్ బిహారీ వాజ్పేయి, అద్వానీ, మొరార్జీ దేశాయ్ లాంటి వారిని వారెంట్ లేకుండా అరెస్టు చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాసిన పత్రిక కార్యాల యాలు విద్యుత్ కోతను విధించడం జర్నలిస్టులను జైల్లో పెట్టించడం జరిగిందన్నారు. బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించడం ప్రజల స్వేచ్ఛను పూర్తిగా హరించారని విమర్శించారు. అలాగే ఇందూరు నుంచి అనేకమంది ఎమర్జెన్సీ కాలంలో జైలు శిక్షణ అనుభవించారని గుర్తు చేశారు. అలాగే జూన్ 25న సంవిధాన్ హత్య దివస్ గా పటిస్తున్నట్టు పేర్కొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో జైలుకు వెళ్లిన వారి త్యాగాలను వృధా కానివ్వమన్నారు. ఇందిరా గాంధీ కుమారుడు సంజీవ్ గాంధీ రాజ్యాంగ సవరణ చేయాలనే ప్రయత్నం చేశారని తెలిపారు. ఎమర్జెన్సీని అడ్డుగా పెట్టుకొని నియంతలా పాలించారని మండిపడ్డారు. అంతకుముందు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను తిలకించారు. ఎమర్జెన్సీ సమయంలో జైలుకు వెళ్లిన సంఘ్ నేతలు రాజేశ్వర్, సిలివేరు శ్రీధర్ లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆనాటి అనుభవాలను వారిరువురు పంచుకు న్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసన్న సత్యపాల్, సుమిత్ర కిషోర్, ప్రసూన శ్రీనివాస్, ఓబీసీ మోర్చ నాయకుడు స్వామి యాదవ్, ఆయా మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# రాచకొండ కోట వెనుక అసలు చరిత్ర ఇదేనా..!

**-600 ఏళ్ల క్రితం రాజులు రాత్రికి రాత్రే ఎందుకు వదిలేశారు?**

**-దెయ్యాల కోటా..శాపగ్రస్త రాజధానా?**

**-చరిత్రను ముసుగు కప్పిన జానపద కథలా?**



హంసకలం వార్త

చారిత్రక కట్టడాలు,పురాతన కోటల గురించి మాట్లాడినప్పుడు వాటి చుట్టూ ఎన్నో కథలు,పుకార్లు వినిపించడం సహజం.ఒకప్పుడు రాజుల వైభవానికి ప్రతీకగా నిలిచిన ప్రాంతాలు కాలక్రమేణా శిథిలాలుగా మారిన తర్వాత వాటి చుట్టూ దెయ్యాల కథలు,శాపాల కథలు అల్లుకుపోవడం మన దేశంలో తరచూ కనిపించే విషయం. అలాంటి చారిత్రక ప్రాధాన్యం కలిగిన కోటల్లో యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాచకొండ కోట ఒకటి. హైదరాబాద్‌కు సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కోట గురించి చాలామందికి తెలియదు. గోల్కొండ, భువనగిరి కోటలకు ఉన్నంత ప్రచారం రాచకొండకు లేకపోయినా,చరిత్రలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. 14వ శతాబ్దంలో పద్మనాయక (వెలమ) రాజులు తమ రాజధానిగా ఈ కోటను నిర్మించారు.నాటి దక్కన్ వాస్తుశిల్పానికి ఇది అద్భుత నిదర్శనంగా నిలిచింది.సున్నం లేకుండా నిర్మించిన అద్భుత రాచకొండ కోట నిర్మాణ ప్రత్యేకతే దాని బలం.భారీ గ్రానైట్ రాళ్లను ఎలాంటి సున్నం లేదా బంధన పదార్థాలు ఉపయోగించకుండా ఒకదానిపై ఒకటి పేర్చి నిర్మించారు. సహజ కొండలనే రక్షణ కవచాలుగా మార్చి,శత్రువులు సులభంగా చేరుకోలేని విధంగా వ్యూహాత్మకంగా నిర్మించారు.నాటి ఇంజినీరింగ్ నైపుణ్యానికి ఇది నిదర్శనం.

**-రాజులు ఎందుకు కోటను విడిచిపెట్టారు..?**

రాచకొండ కోటను రాజులు ఎందుకు విడిచిపెట్టారన్నది ఇప్పటికీ ప్రజల్లో ఆసక్తికరమైన చర్చ ఉంది. స్థానికంగా అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. కొందరి కథనం ప్రకారం, ఒక రాజు ఆధ్యాత్మిక శక్తులు కలిగిన మహిళను అవమానించడంతో ఆమె శాపం వల్ల రాజ్యం పతనమైందని చెబుతారు. మరికొందరు ఒక మహర్షిని అవమానించడం వల్ల కోట శాపగ్రస్తమైందని అంటారు.ఈ కథలకు చారిత్రక ఆధారాలు లేవు. చరిత్రకారుల అభిప్రాయం మాత్రం భిన్నంగా ఉంది.బహమనీ సుల్తానుల విస్తరణ,మారుతున్న రాజకీయ పరిస్థితులు,యుద్ధ వ్యూహాలు వంటి కారణాల వల్లే పద్మనాయక రాజులు రాచకొండను విడిచి కొత్త రాజధానిని ఎంచుకున్నారని చారిత్రక ఆధారాలు సూచిస్తున్నాయి.

**-దెయ్యాల కోటా పేరెందుకు..?**

రాచకొండ కోటను దెయ్యాల కోటగా కొందరు ప్రచారం చేసినప్పటికీ, అలాంటి ప్రచారాలకు శాస్త్రీయ లేదా చారిత్రక ఆధారాలు లేవు. కాలక్రమేణా ప్రజల్లో పుట్టిన జానపద కథలు మాత్రమే ఇవని చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. ట్రెక్కింగ్ ప్రియులకు స్వర్గధామంగా ప్రస్తుతం రాచకొండ కోట ట్రెక్కింగ్ ప్రియులను ఆకర్షిస్తోంది. కోటపైకి చేరుకోవడానికి ప్రత్యేక మెట్లు లేదా సిమెంట్ రోడ్లు లేవు.రాతి బండలు, కొండచరియలు,పచ్చని ప్రకృతి మధ్య నడుస్తూ శిఖరాన్ని చేరుకోవాల్సి ఉంటుంది.ఈ ప్రయాణం కొంత శ్రమతో కూడుకున్నదే అయినప్పటికీ,ప్రకృతి ప్రేమికులకు అరుదైన అనుభూతిని అందిస్తుంది.కోట శిఖరానికి చేరుకుంటే ఎటు చూసినా పచ్చని లోయలు,కొండలు,ప్రశాంతమైన వాతావరణం కనువిందు చేస్తాయి. ముఖ్యంగా సూర్యాస్తమయం సమయంలో రాతి గోడలపై పడే బంగారు కిరణాలు కోటకు మరింత అందాన్ని తెస్తాయి.వెళ్లే ముందు గుర్తుంచుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి.కోటకు వెళ్లే మార్గంలో భద్రతా రెయిలింగ్స్, కంచెలు లేవు.రాతిబండలపై నడవాల్సి ఉండటంతో జాగ్రత్త అవసరం.కోట పరిసరాల్లో దుకాణాలు లేదా తాగునీటి సౌకర్యం లేదు.నీరు,తేలికపాటి ఆహారం వెంట తీసుకెళ్లడం మంచిది.వర్షాకాలంలో రాళ్లు జారే అవకాశం ఉండటంతో మరింత అప్రమత్తంగా ఉండాలి.చరిత్రను చెప్పే రాచకొండ రాచకొండ కోట కేవలం శిథిలమైన కట్టడం కాదు. అది కాకతీయుల అనంతర కాలంలో వెలసిన పద్మనాయకుల వైభవానికి,నాటి సైనిక వ్యూహాలకు, అద్భుత వాస్తుశిల్పానికి సజీవ సాక్ష్యం.దెయ్యాల కథలు, శాపాల ప్రచారాల కంటే ఈ కోట వెనుక ఉన్న నిజమైన చరిత్రను తెలుసుకోవడం మరింత ఆసక్తికరం. ప్రకృతి,చరిత్ర,సాహసం...ఈ మూడింటినీ ఒకే చోట ఆస్వాదించాలనుకునే వారికి రాచకొండ కోట ఒక అపూర్వమైన పర్యాటక గమ్యస్థానం.

# ఓటర్ల జాబితా ప్రక్షాళనకు 'ఎస్.ఐ.ఆర్' శ్రీకారం కలెక్టర్ రాజర్షి షా

హంసకలం వార్త

నేటి నుంచి జూలై 24 వరకు ఇంటింటికీ బూత్ స్థాయి అధికారులు(బి ఎల్ ఓ)అపోహలు నమ్మొద్దు నిజమైన ఓటర్ల పేర్లు తొలగించం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ ఓటర్ల జాబితాలో లోపాలను సవరించి, పారదర్శకమైన జాబితాను రూపొందించేందుకు తెలంగాణ వ్యాప్తంగా ఆదిలాబాద్ జిల్లాలో 'ఎస్.ఐ.ఆర్'(ఎస్ ఐ ఆర్) ప్రక్రియ గురువారం నుండి అధికారికంగా ప్రారంభమైంది.ఈ ప్రత్యేక ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు(బి.ఎల్.ఓ) నేరుగా ఓటర్ల ఇళ్లకు వస్తారని ఆయన పేర్కొన్నారు. స్వయంగా ఓటు వివరాలు సరిచూసుకున్న కలెక్టర్ ఈ ప్రచారంలో భాగంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ స్వయంగా తన ఓటు వివరాలను పరిశీలించుకున్నారు. బి.ఎల్.ఓ కలెక్టర్ నివాసానికి రాగా ఆయన రీప్రింటెడ్ ఎనిమరేషన్ ఫామ్ ద్వారా తన ఓటు వివరాలను క్షుణ్ణంగా సరిచూసుకున్నారు. గతంలో 2002 ఓటర్ జాబితా ప్రకారం ఉన్న తన వివరాలను నమోదు చేసి,ఒక స్పష్టమైన ఫోటోను జతపరిచి బి.ఎల్.ఓకు అందజేశారు. కలెక్టర్ తన పాత జ్ఞాపకాలను పంచుకుంటూ "ప్రస్తుతం నా ఓటు ఆదిలాబాద్‌లోనే ఉన్నప్పటికీ,2002 నాటికి ఇక్కడ లేదు. అప్పట్లో మా తండ్రి గారి ఓటు బీహార్‌లోని అరరియా జిల్లా, ఫార్బిస్‌గంజ్ నియోజకవర్గంలో ఉండేది.గతంలోనే దానికి సంబంధించిన మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేసినందున.ఇప్పుడు అదే వివరాలను ఫామ్‌లో నింపి



బి.ఎల్.ఓకు అందజేశాను.ఆ వివరాలను బి.ఎల్.ఓ వెంటనే 'బి.ఎల్.ఓ యాప్'(బి ఎల్ ఓ యఫ్) లో వెరిఫై చేసి సబ్మిట్ చేశారు."ప్రస్తుతం సాగుతున్న ఈ ఎనిమరేషన్ ప్రక్రియ ఈ రోజు నుండి జూలై 24వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఓటర్లలో ఉన్న కొన్ని అపోహలపై ఆయన క్లారిటీ ఇచ్చారు. తమ తల్లిదండ్రుల ఓట్లు వేరే రాష్ట్రాల్లోనో లేదా ఇతర జిల్లాల్లోనో ఉన్నాయని చెబితే, ఇక్కడున్న తమ ఓటు ఎక్కడ కట్ అయిపోతుందోనని కొందరు భయపడుతున్నారని.. అలాంటి అపోహలను అస్సలు నమ్మవద్దని ఆయన హామీ ఇచ్చారు. అర్హులైన, నిజమైన ఓటర్ల ఓట్లు ఎట్టిపరిస్థితుల్లోనూ తొలగించబడవని స్పష్టం చేశారు.జూలై 31న 'డ్రాఫ్ట్ రోల్' విడుదల ఈ ఎనిమరేషన్ ఫామ్స్ సమర్పించిన తర్వాత జూలై 31న 'డ్రాఫ్ట్ రోల్' (ముసాయిదా ఓటర్ల జాబితా) ప్రచురించబడుతుందని కలెక్టర్ తెలిపారు. అందులో 2002 డేటాబేస్ ప్రకారం వివరాలు నింపి ఇచ్చిన వారందరి ఓట్ల వివరాలు ఉంటాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ఓట్ల తొలగింపుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. నిజమైన ఓటర్లందరూ తప్పకుండా ఈ ఎనిమరేషన్ ఫామ్‌ను నింపి,అందులో తమ వివరాలతో పాటు తల్లిదండ్రులు,తాతయ్య, నానమ్మ లేదా గార్డియన్ల ఓట్ల వివరాలను నమోదు చేయాలని సూచించారు. నింపిన ఫామ్‌లలో ఒక కాపీ ఓటర్ వద్ద భద్రంగా ఉంటుందని,మరొకటి బి.ఎల్.ఓకు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోస్టల్ అకౌంట్ లో నుండి 2లక్షల మాయం...!

**-పోస్ట్ ఆఫీస్ అధికారి మోసానికి బలైన నిరుపేద ఒంటరి మహిళ**

**-కొత్తగూడ మండల పోస్ట్ ఆఫీసులో అప్పటి బ్రాంచ్ మేనేజర్ రమేష్ నిర్వాహకం**

హంసకలం వార్త

జిల్లాలోని కొత్తగూడ మండల పోస్ట్ ఆఫీసులో గతంలో పోస్ట్ బ్రాంచ్ మేనేజర్ గా పని చేసిన ఉద్యోగి నిర్వాహకంతో ఓ ఒంటరి కుటుంబం వీధిన పడింది.కొత్తగూడకు చెందిన సందీప్ అనారోగ్యంతో మృతి చెందగా,ఆయన భార్య రచన తన పసిబిడ్డతో ఒంటరిగా జీవిస్తోంది.ఆ కుటుంబం పరిస్థితిని చూసి చలించిన దాతలు,రచన కోసం సుమారు రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు.ఈ మొత్తాన్ని ఆమె(రచన)తన బిడ్డ కోసం కొత్తగూడ పోస్ట్ ఆఫీసులో భద్రపరుచుకుంది.అప్పటి బ్రాంచ్ మేనేజర్ రమేష్,రచనకు తెలియకుండానే ఆ సొమ్మును 27-12-2025 లో డ్రా చేసి కాజేశాడు.ఆ తర్వాత బదిలీపై అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

**-బయటపడిన నిజం..రాజీకి ప్రయత్నాలు**

ఇటీవల తన ఖాతాలో నగదు లేదని గ్రహించిన బాధితురాలు రచన ఒక్కసారిగా షాక్‌కు గురైంది.తన పసిబిడ్డ భవిష్యత్తు కోసం దాచుకున్న డబ్బు మాయం కావడంతో ఆమె కన్నీరుమున్నీరవుతోంది. విషయం బయటకు పొక్కడంతో,నిందితుడు రమేష్ తన బంధువుల ద్వారా బాధితురాలికి ఫోన్లు చేయిస్తూ.. రాజీకి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.?ఈ దారుణంపై స్థానికులు, ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



పోస్ట్ ఆఫీస్ వంటి బాధ్యతాయుతమైన శాఖలో పని చేసే అధికారి,ఒక నిరుపేద మహిళ నోటికాడ కూడును లాక్కోవడంపై మండిప డుతున్నారు. ఇలాంటివి ఇంకా ఎన్ని స్కామ్ లు చేసి ఉంటారని. .ఆ..దొంగ అధికారి రమేష్‌పై శాఖాప రమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

హంసకలం వార్త



ప్రజా ఆరోగ్యం దృష్ట్యా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,ఉప కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని, ఈ క్రమంలో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించి అధిక శాతం నమోదు అవుతున్న వ్యాధులు, అందిస్తున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ..వైద్య రంగ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రులు,ఆరోగ్య కేంద్రాలను ఆధునికరిస్తూ, ఆధునిక సాంకేతిక పరికరాలను సమకూర్చి ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. వర్షాకాలం అయినందున వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అవసరమైన మందుల నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు,సిబ్బంది నిధుల పట్ల సమయపాలన పాటించాలని,ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.విద్యా రంగంలో ఆచరణాత్మక మార్పులను తీసుకువస్తూ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని వెంకటరావుపేట గ్రామంలో కొనసా గుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బూత్ స్థాయి అధికారులకు కార్యక్రమం నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయడం,తిరిగి సేకరించడం,వివరాల నమోదు అంశాలలో జాగ్రత్త వహించాలని,ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సందర్శించి తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని,కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడంలో యువత భాగస్వాములు కావాలి

**-జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**
**-ప్రతి ఒక్క విద్యార్థి యాంటీ డ్రగ్స్ వారియర్ గా పనిచేయాలి**
**-ఉన్నత లక్ష్యాలను సాదించి తల్లిదండ్రులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి.**

హంసకలం వార్త



యువత సమాజం నుంచి మంచి విలువలను మాత్రమే నేర్చుకోవాలని, చెడు వ్యసనాలు మరియు మాదకద్రవ్యాల బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకోకూడదని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని పట్టణంలోని వాసవి గార్డెన్స్‌లో నిర్వహించారు. డ్రగ్స్ వ్యక్తిగత ఆరోగ్యాన్నే కాకుండా కుటుంబ వ్యవస్థను, సామాజిక విలువలను మరియు దేశ భవిష్యత్తును కూడా దెబ్బతీస్తాయని అన్నారు. యువత జీవితంలో విజయాలను సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, కఠోర శ్రమ అనే మూడు సూత్రాలను పాటించాలని సూచించారు. కొంతమంది యువకులు ఆసక్తి, స్నేహితుల ఒత్తిడి లేదా తప్పుడు ప్రచారాలకు ఆకర్షితులై డ్రగ్స్ వైపు మొగ్గు చూపుతున్నారని, అలాంటి నిర్ణయాలు జీవితాన్ని చీకటిలోకి నెట్టివేస్తాయని హెచ్చరించారు. "డ్రగ్స్‌లో మొదటి అడుగు సరదాగా ప్రారంభమవుతుంది.. చివరి అడుగు జీవితాన్ని నాశనం చేస్తుంది" అని పేర్కొన్నారు. డ్రగ్స్ వ్యాపారులు యువతనే లక్ష్యంగా చేసుకుని "ఒక్కసారి ప్రయత్నించు.. ఏం కాదు" లేదా "ఇది ఫ్యాషన్" అంటూ మోసం చేస్తున్నారని, అలాంటి వ్యక్తులు మరియు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా డ్రగ్స్ ఆఫర్ చేసినా, వారు ఎంత సన్నిహితులైనా ధైర్యంగా "నో" చెప్పాలని, ఆ ఒక్క నిర్ణయం జీవితాన్ని పెద్ద ప్రమాదం నుంచి కాపాడుతుందని తెలిపారు. జిల్లా పోలీసు శాఖ మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించిందని, డ్రగ్స్ విక్రయాలు, రవాణా మరియు వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి "డ్రగ్స్‌కు నో చెప్పండి -- జీవితానికి ఎస్ చెప్పండి" అనే నినాదంతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై వీడియోల ద్వారా అవగాహన కల్పించారు. డ్రగ్స్ నివారణలో యువత పాత్రపై ఎస్పీ అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి,ఇన్‌స్పెక్టర్ లు శ్రీనివాస్, కరుణాకర్, ఎస్.ఐ లు మల్లేశం, కుమారస్వామి, సదకర్, సుప్రియా మరియు ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నిర్మూలనలో వైద్య విద్యార్థులు ముందుండాలి

**-వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

హంసకలం వార్త



నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనలో ప్రతి వైద్య విద్యార్థి ఒక చైతన్య దూతగా ముందుకు రావాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అన్నారు.దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "నషా ముక్త్ భారత్" వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై, జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ఐపీఎస్ తో కలిసి వైద్య విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, వాటి నివారణలో యువత, వైద్యుల బాధ్యతలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్య కళాశాల విద్యార్థులు "మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటాం... ఇతరులను కూడా దూరంగా ఉండేలా చైతన్యం కల్పిస్తాం" అంటూ యాంటీ డ్రగ్స్ ప్రతిజ్ఞ చేశారు. తదనంతరం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ ఫోటో పాయింట్ వద్ద జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ, అధ్యాపకులు, విద్యార్థులు సందేశాత్మక ఫోటోలు దిగడంతో పాటు యాంటీ డ్రగ్స్ సంతకాల కార్యక్రమంలో పాల్గొని డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తమ మద్దతును ప్రకటించారు .ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...వైద్య విద్యార్థులైన మీరు రేపటి సమాజానికి ఆరోగ్యాన్ని అందించే వైద్యులు. మీరు ఎంచుకున్న వైద్య వృత్తి అత్యంత పవిత్రమైనది. అలాంటి గొప్ప లక్ష్యంతో ముందుకు సాగుతున్న మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్, మాదకద్రవ్యాల వంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా, సంపూర్ణ ఏకాగ్రతతో వైద్య విద్యను అభ్యసించి, నైపుణ్యం కలిగిన వైద్యులుగా ఎదగాలి. మీ చేతుల్లో భవిష్యత్తులో వేలాది మంది ప్రాణాలు ఉంటాయి. అందువల్ల మీ ఆరోగ్యం, మీ వ్యక్తిత్వం, మీ క్రమశిక్షణ, మీ విలువలు సమాజానికి ఆదర్శంగా నిలవాలని, మాదక ద్రవ్యాలు ఒక వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాదు... అతని ఆశయాలను, కుటుంబాన్ని, భవిష్యత్తును కూడా నాశనం చేస్తాయి. వైద్య విద్యార్థులుగా మీరు డ్రగ్స్ వల్ల శరీరంపై, మెదడుపై, మానసిక ఆరోగ్యంపై కలిగే దుష్ప్ర భావాలను బాగా అర్థం చేసుకునే స్థితిలో ఉన్నారు. అందుకే ముందుగా మీరే డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండి, మీ స్నేహితులు, సహ విద్యార్థులు కూడా అలాంటి వ్యసనాలకు గురికాకుండా అప్రమత్తం చేయాలని. భవిష్యత్తులో మీరు వైద్యులుగా సేవలందించే సమయంలో డ్రగ్స్ బారిన పడిన యువతకు సరైన వైద్యం, కౌన్సెలింగ్ అందించి వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించాలి. మంచి వైద్యుడు వ్యాధులను మాత్రమే కాదు... సమాజంలోని చెడు వ్యసనాలను కూడా నిర్మూలించే దిశగా పనిచేయాలి. మీ విద్య కేవలం డిగ్రీ కోసమే కాదు... సమాజ ఆరోగ్యాన్ని కాపాడే మహత్తర బాధ్యత కోసం అన్న విషయాన్ని ఎప్పటికీ గుర్తుంచుకోవాలని ఎస్పీ గారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి అదనపు ఎస్పీ, రాజేష్ మీనా ఐపీఎస్, వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్, జ్యోతి రెడ్డి, వైద్యకళాశాల ఆర్గనైజర్, డా,హరికృష్ణ, వనపర్తి సీఐ రత్నం, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్, నార్కోటిక్ ఎస్సై, అంజద్ అధ్యాపకులు, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారం నింపాలి
# పాస్ పోర్ట్ సైజ్ ఫొటో ఇవ్వాలి

**-బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలి**
**-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్**



హంసకలం వార్త

ఓటర్ జాబితాలో ఉన్న వారందరూ ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరిగా నింపాలని,ఫారం,ప్రస్తుత పాస్ పోర్ట్ సైజ్ ఫొటో బీఎల్‌ఓలకు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ సూచించారు.ఎస్ఐఆర్ పై జిల్లాలోని ఈఆర్‌ఓలు,ఏఈఆర్‌ఓలు,బూత్ లెవెల్ అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ అనేది చాలా ప్రత్యేకమని తెలిపారు.బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని,ఇంటింటికీ వెళ్లి ఓటర్ జాబితాలో ఉన్న వారందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని సూచించారు.ఫారాలు నింపడంలో సహాయం చేయాలని తెలిపారు.ప్రతి ఓటర్ తమ పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు సిద్ధంగా పెట్టుకోవాలని సూచించారు.బీఎల్‌ఓ లకు ఫారాలు,పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు వచ్చేనెల జూలై 24వ తేదీలోగా ఇవ్వాలని సూచించారు.ఈఆర్‌ఓ,ఏఈఆర్‌ఓలు,బీ ఎల్ ఓ సూపర్ వైజర్లు క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలించాలని తెలిపారు.బీ ఎల్ ఓ లు తమకు అందించిన సామగ్రి,ఐడీ కార్డుతో తమ పరిధిలోని ఇండ్లకు బీఎల్‌ఏలతో కలిసి వెళ్లాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం,ఎన్నికల విభాగం అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి...

**-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**
**-ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి..**
**-క్రిటికల్ కేర్ భవనం పనులు వేగవంతం చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలి..**
**-పరిశుభ్రత, పారిశుధ్యం, రోగులకు మెరుగైన సేవలు, మర్యాదపూర్వక వైఖరిపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు..**
**-ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా విడివోస్ కాలనీలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించిన మంత్రి**



హంసకలం వార్త

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన మంత్రి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, ఔషధాల లభ్యత, వైద్యులు, సిబ్బంది పనితీరు, తదితర అంశాలపై వైద్య అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో నేరుగా మాట్లాడి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి, వారి సహాయకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. ఖమ్మం జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. భవనం ప్రారంభోత్సవానికి ముందే ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్ఠం చేయాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆకర్షణీయమైన మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పరిశుభ్ర వాతావరణం ఉండాలని, అంతర్గత రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచి గుంతలు లేకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆసుపత్రుల్లో ప్రతి రోగి సంతృప్తి చెందే విధంగా సేవలు అందించాలని మంత్రి అన్నారు. అనంతరం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నియోజకవర్గంలోని విడివోస్ కాలనీలో కొనసాగుతున్న ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను మంత్రి పరిశీలించారు. ఇంటింటి సర్వే, వివరాల నమోదు ప్రక్రియ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, వేగవంతంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, వైద్య శాఖ అధికారులు, తదితరులు వున్నారు.

# స్పోర్ట్స్

## మహిళల టీ20 ప్రపంచకప్..టాస్ గెలిచిన బంగ్లా



మహిళా క్రికెట్‌కు భారీ బూస్ట్.. మహిళా క్రికెటర్ల కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రవేశపెట్టిన నూతన మార్గదర్శకాలపై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ హర్షం వ్యక్తంచేశారు. ప్రసవానంతరం మహిళా క్రీడాకారిణులు తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు రూపొందించిన ఈ నిబంధనలు, మహిళా క్రికెట్‌కు భారీ ఊతమని ఆయన అభివర్ణించారు. మాతృత్వం, వృత్తిగత కెరీర్‌ను సమన్వయం చేసుకునేందుకు ఈ మార్గదర్శకాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఐసీసీ తాజాగా 'రిటర్న్ టు ప్లే పోస్ట్-ప్రెగ్నెన్సీ గైడ్‌లైన్స్'ను విడుదల చేసింది. గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో, ప్రసవం తర్వాత క్రీడాకారిణుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరు దశల విధానాన్ని ఇందులో పొందుపరిచారు. మహిళా క్రికెటర్ల కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ప్రవేశపెట్టిన నూతన మార్గదర్శకాలపై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ హర్షం వ్యక్తంచేశారు. ప్రసవానంతరం మహిళా క్రీడాకారిణులు తిరిగి మైదానంలోకి అడుగుపెట్టేందుకు రూపొందించిన ఈ నిబంధనలు, మహిళా క్రికెట్‌కు భారీ ఊతమని ఆయన అభివర్ణించారు. ప్రపంచవ్యాప్తంగా మహిళా క్రికెటర్ల కోసం ఒక నిర్దిష్ట కార్యాచరణను రూపొందించడం ఇదే తొలిసారి. మాతృత్వం కారణంగా ఏ క్రీడాకారిణి కూడా తన దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని కోల్పోకూడదనే ఉద్దేశంతోనే ఈ మార్గదర్శకాలను తీసుకొచ్చినట్లు ఐసీసీ ఛైర్మన్ జై షా తెలిపారు. గతంలో చాలామంది క్రీడాకారిణులు కుటుంబ బాధ్యతల నిమిత్తం కెరీర్ మధ్యలోనే వీడ్కోలు పలకాల్సి వచ్చేది. ఈ నూతన విధానం ప్రతిభావంతులైన క్రీడాకారిణులు ఆటలో సుదీర్ఘకాలం కొనసాగేందుకు తోడ్పడుతుందని ఆయన ఆకాంక్షించారు.

## మూడో టెస్టుకు దూరమైన హెన్రీ, ఫిలిప్స్..!



రూ.12 కోట్లు తగ్గించుకుని! ఐపీఎల్ ప్రాంఛైజీలు మంచి ఆటగాడితో పాటు జట్టుకు విలువ జోడించగల, స్టేడియానికి అభిమానులను పోటెత్తించగల స్టార్‌డమ్, సత్తా ఉన్న క్రికెటర్‌ను కొనుగోలు చేసేందుకు ఎల్లప్పుడూ మొగ్గుచూపుతాయి. ఆ కోవలోకి వచ్చే ఆటగాళ్లలో రిషబ్ పంత్ ఒకడు. అందుకే, కారు ప్రమాదం నుంచి బయటపడి వచ్చినా రిషబ్ పంత్ వేలంలో రూ.27 కోట్లు దక్కించుకున్నాడు. ఐపీఎల్ వేలంలో ఇదే ఇప్పటివరకు అత్యధిక ధర. కానీ, వరుస సీజన్లలో వైఫల్యం పంత్ విలువను తగ్గించేసింది. ఏకంగా రూ.12 కోట్ల తక్కువ ధరకే రిషబ్ పంత్ పాత ప్రాంఛైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు మారిపోయాడు. లక్నో సూపర్‌జెయింట్స్‌కు కుల్‌దీప్ కీలక ఆటగాళ్ల ట్రేడింగ్ విజయవంతం 2027 ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ముంగిట కీలక ఆటగాళ్ల ట్రేడింగ్‌కు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. ఐపీఎల్ 2026 ఫైనల్‌కు ముందే, లక్నో సూపర్ జెయింట్స్ సారథ్య పగ్గాలు వదిలేసిన రిషబ్ పంత్.. ట్రేడింగ్‌లో జట్టు మారేందుకు సైతం సుముఖత వ్యక్తం చేశాడు. రూ.27 కోట్ల రికార్డు ధరకు రిషబ్ పంత్‌ను 2025 ఆటగాళ్ల వేలంలో కొనుగోలు చేసిన లక్నో సూపర్‌జెయింట్స్ పంత్‌ను ట్రేడ్ చేసేందుకు ప్రాంఛైజీలకు ఆఫర్ చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో పాటు ఐపీఎల్ టైటిల్‌ను రెండు కంటే ఎక్కువ సార్లు నెగ్గిన ప్రాంఛైజీ సైతం పంత్‌ను తీసుకునేందుకు ప్రయత్నించింది. చివరగా, ఢిల్లీ క్యాపిటల్స్ రిషబ్ పంత్‌ను కొనుగోలు చేసేందుకు లక్నో సూపర్‌జెయింట్స్‌తో ఒప్పందం ఖరారు చేసుకుంది. రూ.15 కోట్లకు రిషబ్ పంత్ ఢిల్లీ క్యాపిటల్స్‌కు మారనుండగా.. పంత్‌కు బదులుగా కుల్‌దీప్ యాదవ్‌ను లక్నో సూపర్‌జెయింట్స్ తీసుకుంది. కుల్‌దీప్ యాదవ్ రూ.13.50 కోట్లు ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి అందుకోగా.. అదే ధరకు లక్నో సూపర్‌జెయింట్స్‌కు మారాడు. రిషబ్ పంత్‌ను ట్రేడ్ చేసిన లక్నో సూపర్‌జెయింట్స్ రూ.27 కోట్ల వేలం పర్సును మిగిల్చుకుంది. కుల్‌దీప్ యాదవ్‌ను రూ.13.5 కోట్లకు తీసుకోవటంలోడ లక్నో సూపర్‌జెయింట్స్ వద్ద మరో రూ.13.5 కోట్ల వేలం పర్సు మిగిలి ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్ కుల్‌దీప్ యాదవ్‌ను ట్రేడ్ చేసి రూ.13.50 కోట్లను మిగిల్చుకోగా.. రిషబ్ పంత్‌ను తీసుకోవటంతో మరో రూ.1.50 కోట్ల వేలం పర్సును కోల్పోయింది. తగ్గిన రిషబ్ పంత్ రిషత్ పంత్ 2016లో ఐపీఎల్ కెరీర్ ఢిల్లీ డేర్‌డెవిల్స్ (ఢిల్లీ క్యాపిటల్స్ పాత పేరు) నుంచి మొదలెట్టాడు. 2024 సీజన్ వరకు ఢిల్లీ క్యాపిటల్స్ తరఫునే ఆడాడు. కారు ప్రమాదంలో పంత్ తీవ్రంగా గాయపడిన ఏడాది శ్రేయస్ అయ్యర్ క్యాపిటల్స్ కెప్టెన్‌గా వ్యవహరించి ఆ సీజన్‌లో ఫైనల్‌కు తీసుకెళ్లాడు. అయినా, క్యాపిటల్స్ యాజమాన్యం పంత్ వైపు మొగ్గుచూపించింది. క్యాపిటల్స్ యాజమాన్యంలో పార్థ్ జిందాల్ వ్యక్తిగతంగా పంత్‌కు అభిమాని. అయినా, వేలంలోకి వచ్చిన పంత్ రికార్డు ధర దక్కించుకున్నాడు. రూ.23 కోట్ల వరకు క్యాపిటల్స్ సైతం పంత్ కోసం ప్రయత్నం చేసింది. రికార్డు ధర ఒత్తిడి, జట్టును నడిపించటంలో ఆందోళన, విపరీత అంచనాలు, సత్వర సక్సెస్ కోరుకునే ప్రాంఛైజీ.. ఇలా పలు అంశాలను రిషబ్ పంత్‌పై ప్రతికూల ప్రభావం చూపించాయి. రెండు సీజన్లలో పంత్ ఆటగాడిగా, కెప్టెన్‌గా నిరాశపరిచాడు. ఫలితంగా, ఈ ఏడాది ప్లే ఆఫ్స్‌కు లక్నో అర్హత సాధించలేదు.

## ఇంగ్లండ్‌ను నిలువరించిన ఘనా



భారత క్రికెట్ జట్టుకు గాయం రూపంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయం కారణంగా ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌లకు దూరమయ్యాడు. అతడి స్థానంలో ముంబై యువ ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్గేకు తొలిసారి భారత సీనియర్ జట్టులో చోటు కల్పించినట్లు బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన మూడో వన్డే అనంతరం నితీశ్ ఎడమ తొడ కండరాల్లో అసౌకర్యం ఉన్నట్లు వైద్య బృందానికి తెలియజేశాడు. అనంతరం నిర్వహించిన వైద్య పరీక్షల్లో గాయం నిర్ధారణ కావడంతో అతడికి కొంతకాలం విశ్రాంతి, పునరావాసం అవసరమని బీసీసీఐ మెడికల్ టీమ్ సూచించింది. దీంతో ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో జరిగే రెండు టీ20 సిరీస్‌ల నుంచి అతడిని తప్పించారు. ఇప్పటికే గాయం కారణంగా హార్దిక్ పాండ్య అందుబాటులో లేకపోవడంతో, నితీశ్ రెడ్డి జట్టులో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తాడని భావించారు. ముఖ్యంగా బ్యాటింగ్‌తో పాటు మీడియం పేస్ బౌలింగ్ చేయగల ఆల్‌రౌండర్‌గా అతడు జట్టుకు బ్యాలెన్స్ తీసుకొచ్చే ఆటగాడిగా గుర్తింపు పొందాడు. అయితే గాయం కారణంగా అతడు టూర్‌కు దూరం కావడం సెలెక్టర్లకు నిరాశ కలిగించింది. ఇక నితీశ్ స్థానంలో ఎంపికైన 23 ఏండ్ల సూర్యాంశ్ షెడ్గే ఇటీవల శ్రీలంకలో జరిగిన ట్రై-సిరీస్‌లో ఇండియా-ఏ తరఫున ఆకట్టుకున్నాడు. ఐదు మ్యాచ్‌ల్లో 147 పరుగులు చేయడంతో పాటు బంతితో కూడా రెండు వికెట్లు సాధించాడు. అలాగే 2024-25 సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ముంబై జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ టోర్నీలో 251.92 స్ట్రైక్‌రేట్‌తో 131 పరుగులు చేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు.

# బిజినెస్

## ఉదయం భారీ లాభాలతో ప్రారంభమైన మార్కెట్‌లు.



894 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్.. రూ.5.77 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరి సూచీలకు గ్లోబల్ మార్కెట్ల సెగ.. 894 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్.. రూ.5.77 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరి రూ.5.77 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరి దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. గత ఐదు రోజులుగా భారీగా పుంజుకున్న సూచీలు తీవ్ర ఒత్తిళ్లకు గురయ్యాయి. ఎఫ్‌ఐఐలు భారీగా పెట్టుబడులను ఉపసంహరించుకుపోవడం, ఐటీ, మెటల్ రంగ షేర్లలో అమ్మకాలు జరుగడంతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు మదుపర్లను నష్టాలవైపు నడిపించాయి. ఇంట్రాడేలో వెయ్యి పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 893.39 పాయింట్లు లేదా 1.16 శాతం నష్టపోయి 76,200.68 వద్దకు జారుకున్నది. మరో సూచీ ఎన్ఎస్ఈ నిఫ్టీ 278.80 పాయింట్లు లేదా 1.16 శాతం కోల్పోయి 23,824.10 వద్ద స్థిరపడింది. దేశీయ మార్కెట్లు కుప్పకూలడంతో మదుపర్లు లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.5.77 లక్షల కోట్లు కరిగిపోయి రూ.474 లక్షల కోట్లకు పడిపోయింది. లాభాల్లో ప్రారంభమైన సూచీలు మధ్యాహ్నం వరకు లాభాల్లో కొనసాగాయి. ఆ తర్వాత అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో మదుపర్లలో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో ఒక్కసారిగా కుప్పకూలాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఏఐ టెక్నాలజీ దూసుకుపోతుండటంతో ఐటీ రంగ షేర్లపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపిందన్నారు. ఈ నెల 11 నుంచి ఇప్పటి వరకు నాలుగు శాతానికి పైగా ఎగబాకిన సూచీల్లో ప్రాఫిట్ బుకింగ్ జరిగిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్ లిమిటెడ్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. రూపాయి మరింత బలహీనం కావడం కూడా సూచీల పతనానికి ఆజ్యంపోసిందన్నారు. ఇన్ఫోసిస్ షేరు 3.36 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు టీసీఎస్, బీఈఎల్, టాటాస్టీల్, అదానీపోర్ట్స్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఎస్బీఐ, టైటాన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టెక్ మహీంద్రా, రిలయన్స్, ట్రెంట్, హెచ్‌యూఎల్, బజాజ్‌ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా, ఇండిగో, భారతీ ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, కొటక్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి. పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, సన్‌ఫార్మా షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా మెటల్ సూచీ 3 శాతం వరకు పతనం చెందింది. దీంతోపాటు ఐటీ 2.24 శాతం పడిపోగా, పీఎస్‌యూ బ్యాంకింగ్ 2.08 శాతం, కమోడిటీస్ 1.90 శాతం, టెలికమ్యూనికేషన్స్ 1.88 శాతం, ఫోకస్డ్ ఐటీ 1.81 శాతం, బ్యాంకింగ్ 1.42 శాతం వరకు పడిపోయాయి. కేవలం హెల్త్‌కేర్‌కు సంబంధించిన సూచీ లాభాల్లో ముగిసింది. సూచీల్లో 2,794 షేర్లు పతనం చెందగా..1,496 షేర్లు లాభపడ్డాయి. రూపాయి 13 పైసలు డౌన్ రూపాయి పతనం కొనసాగుతున్నది. గ్లోబల్ ఫారెక్స్ మార్కెట్లో అనూహ్యంగా డాలర్‌కు డిమాండ్ ఊపందుకోవడంతో ఇతర కరెన్సీలు ఢీలాపడ్డాయి. ఈ క్రమంలో దేశీయ కరెన్సీ విలువ కూడా మంగళవారం 13 పైసలు కోల్పోయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.76 వద్ద ముగిసింది. ఉదయం 94.73 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు 94.63-94.92 స్థాయిలో కదలాడింది. సోమవారం కూడా రూపాయి 30 పైసలు కోల్పోయిన విషయం తెలిసిందే.

## బంధన్ బ్యాంక్ ఎఫ్‌డీ రేట్ల పెంపు




సంస్థలకు 65% ముడి సరుకు అక్కడి నుంచే దేశీయ ఫార్మా రంగం.. భారతీయ ఔషధ తయారీ సంస్థలకు 65% ముడి సరుకు అక్కడి నుంచే: నీతి ఆయోగ్ దేశీయ ఫార్మా రంగం.. పొరుగు దేశం ముడి సరుకుపైనే ఎక్కువగా ఆధారపడుతున్నదని నీతి ఆయోగ్ తెలియజేసింది. భారతీయ ఔషధ తయారీ సంస్థలు.. 65 శాతం క్రిటికల్ యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్ (ఏపీఐ), కీ స్టార్టింగ్ మెటీరియల్స్ (కేఎస్ఎమ్) తదితరాలను చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నాయని మంగళవారం తెలిపింది. దేశంలో పర్యావరణ నిబంధనల్ని పాటించాల్సిన అవసరాలు పెరుగుతున్నకొద్దీ ఉత్పాదక, పరిశోధన-అభివృద్ధి వ్యయాలు కూడా ఔషధ తయారీ రంగంలో బాగా పెరుగుతున్నాయని తమ 'ట్రేడ్ వాచ్ క్వార్టర్లీ' 8వ ఎడిషన్‌లో నీతి ఆయోగ్ పేర్కొన్నది.ఽచౌకగా దిగుమతి.. ఔషధాల ఉత్పత్తికి అవసరమైన ప్రధాన ముడి సరుకు దేశంలో తయారు కాకపోవడానికి ముఖ్య కారణం.. ఇక్కడయ్యే అధిక ఖర్చులేనన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ వర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. దేశీయంగా తయారయ్యే ముడి సరుకు కంటే సులువుగా, చౌకగా చైనాలో లభిస్తుండటంతో దిగుమతులపైనే మెజారిటీ కంపెనీలు ఆధారపడుతున్నాయంటున్నారు. ఫార్మా ఇండస్ట్రీ కార్యకలాపాలు.. భూ, వాయు, జల కాలుష్యాలకు దారితీస్తుండటం కూడా ఇతర దేశాల నుంచి ముడి సరుకు దిగుమతుల్ని పెంచుతున్నదని ఈ రంగ విశ్లేషకుల మాట. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే లోపభూయిష్టమైన విధానాలు సైతం ఔషధ రంగాభివృద్ధిని అడ్డుకుంటున్నాయని చెప్తున్నారు. పెట్టుబడులపై అనిశ్చితి నెమ్మదించిన ఆవిష్కరణలు, వాటికి వాణిజ్యపరమైన దన్ను లభించకపోవడం.. దేశంలో ఆవిష్కర్తలకు, దీర్ఘకాలిక పెట్టుబడులకు అనిశ్చిత పరిస్థితుల్ని తెచ్చిపెడుతున్నదని నీతి ఆయోగ్ తాజా నివేదిక చెప్పడం గమనార్హం. కాగా, హై-వాల్యూ ఫార్మాస్యూటికల్ సెగ్మెంట్లలో వైవిధ్యాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదన్నది. అంతేగాక రెగ్యులేటరీ విధానాల్లో పారదర్శకత, మెరుగైన విద్యా వ్యవస్థ, బలమైన పరిశ్రమ.. లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో సాంకేతిక పరివర్తనకు దోహదం చేయగలవని సూచించింది. అప్పుడే పరిశోధన సహకారం, స్టార్టప్ ఇంక్యుబేషన్‌కు మార్గం సుగమం కాగలదన్నది. ఔషధ రంగంలో పరిమాణంపరంగా బాగానే ఉన్న భారత్.. విలువపరంగానూ పెరుగాల్సిన అవసరం ఉన్నదని తాజా నివేదిక విడుదల సందర్భంగా నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్ లహ్రీ వ్యాఖ్యానించారు.

## భీమ్ పేమెంట్స్ మూడింతలు





ప్రభుత్వరంగ సంస్థ భీమ్ పేమెంట్స్ యాప్ లావాదేవీలు మూడింతలు అయ్యాయి. జూన్ 2025 నుంచి మే 2026 వరకు ఈ యాప్ ద్వారా జరిపే ఆర్థిక లావాదేవీలు మూడింతలు పెరిగినట్టు ఎన్‌పీసీఐ భీమ్ సర్వీసెస్ లిమిటెడ్ వెల్లడించింది. గతేడాది జూన్‌లో 79.64 మిలియన్ల లావాదేవీలు జరుగగా..ఈసారి మే చివరినాటికి ఇవి 244 మిలియన్లకు చేరుకున్నాయని ఎన్‌బీఎస్ఎల్ ఎండీ, సీఈవో లలితా నటరాజ్ తెలిపారు. మొత్తం లావాదేవీల విలువ రూ.26,952 కోట్లుగా నమోదైందన్నారు. ప్రస్తుతం అందిస్తున్న ఆర్థిక సేవలకుగాను క్రెడిట్ కార్డు, డిజిటల్ రుణాలు, ఇతర రుణాల సేవలను కూడా త్వరలో ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. దేశవ్యాప్తంగా జరిగిన లావాదేవీల్లో తెలంగాణ వాటా 23.9 శాతంగా ఉన్నదన్నారు.


# ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ వెండితెర ఎంట్రీ

గ్రాండ్‌గా 'వెంకట్రామయ్య గారి తాలూకా' టీజర్ లాంచ్ దినేష్ కుమార్ హీరోగా, ప్రముఖ నటుడు ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమవుతున్న చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా' టీజర్, పాటల ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. దినేష్ కుమార్ హీరోగా, ప్రముఖ నటుడు ఈటీవీ ప్రభాకర్ కుమార్తె దివిజ ప్రభాకర్ హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమవుతున్న చిత్రం 'వెంకట్రామయ్య గారి తాలూకా' టీజర్, పాటల ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది. సతీష్ ఆవాల దర్శకత్వంలో కోమలి క్రియేషన్స్ బ్యానర్‌పై కోమలి మహేందర్ తొట్టె, సోమేష్ సారిపల్లి సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని జూలై 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. విడుదలైన టీజర్, పాటలకు ప్రేక్షకులతో పాటు సినీ పరిశ్రమ వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. మానవ సంబంధాలు, తల్లిదండ్రుల విలువ, కుటుంబ బంధాలు, ఫాదర్ సెంటిమెంట్ ప్రధానాంశాలుగా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తుందని చిత్రబృందం తెలిపింది. ప్రస్తుత సమాజంలో డబ్బు చుట్టూ తిరుగుతున్న మానవ సంబంధాలు, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను హృద్యంగా ఆవిష్కరించిన కుటుంబ కథా చిత్రమిది. ఈ సినిమాలో మురళీధర్ గౌడ్, సుధ కీలక పాత్రలు పోషించారు. ఈటీవీ ప్రభాకర్ మాట్లాడుతూ ముత్యాల సుబ్బయ్య గారి చిత్రాలను గుర్తు చేసే గొప్ప కథ ఇదని, నాన్న గొప్పతనం, తల్లిదండ్రుల విలువను ఎంతో హృద్యంగా చూపించారని అన్నారు. డాక్టర్ అవుతుందనుకున్న తన కుమార్తె దివిజ ఈ సినిమాతో నటిగా పరిచయమవుతోందని తెలిపారు. దర్శకుడు సతీష్ ఆవాల మాట్లాడుతూ మన దేశ సంస్కృతిలో పెద్దలకు గౌరవం ఇవ్వడం గొప్ప సంప్రదాయమని, కుటుంబాల్లో ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో ఈ సినిమా చూపిస్తుందని అన్నారు. నిర్మాతలు కోమలి, మహేందర్ మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబంలో చూసిన అనుభవాలను ఈ సినిమాలో చూపించామని, సినిమా చూస్తున్నంతసేపు కంటతడి పెట్టకుండా ఎవరూ బయటకు రారని అన్నారు. సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ అందించిన ఆరు పాటలు ప్రేక్షకుల హృదయాలను తాకుతాయని తెలిపారు. హీరో దినేష్ కుమార్, హీరోయిన్ దివిజ ప్రభాకర్‌తో పాటు కాశి విశ్వనాథ్, సెల్వరాజ్, మిర్చి మాధవి, జబర్దస్త్ సత్యశ్రీ తదితరులు నటించారు.



## రూ.500 కోట్ల క్లబ్‌కు 'పెద్ది' దూరం




'దేవర' రికార్డును అందుకోలేకపోయిన రామ్ చరణ్ సినిమా మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగించింది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం భారీ వసూళ్లను నమోదు చేసి రామ్ చరణ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచింది. అయితే అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన రూ.500 కోట్ల గ్రాస్ మార్క్ మాత్రం అందని ద్రాక్షగానే మిగిలే అవకాశం కనిపిస్తోంది. 'పెద్ది' విడుదలకు ముందే సోషల్ మీడియాలో రామ్ చరణ్, ఎన్టీఆర్ అభిమానుల మధ్య రికార్డుల చర్చ జోరుగా సాగింది. ముఖ్యంగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' సినిమా సాధించిన వసూళ్లను అధిగమించడమే మెగా అభిమానుల ప్రధాన లక్ష్యంగా మారింది. 'దేవర'కు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించడంతో, 'పెద్ది' మరింత భారీ విజయాన్ని అందుకుంటుందని అభిమానులు ఆశించారు. అయితే విడుదలైన తొలి రోజే 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.135 కోట్ల గ్రాస్ వసూళ్లను నమోదు చేసి బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. మొదటి వారంలోనే సినిమా అద్భుతమైన కలెక్షన్లు సాధించి రామ్ చరణ్ కెరీర్‌లో అతిపెద్ద సోలో హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈ చిత్రం రూ.450 కోట్ల మార్క్ దిశగా అడుగులు వేస్తున్నప్పటికీ, థియేట్రికల్ రన్ ముగింపు దశకు చేరుకోవడంతో రూ.500 కోట్ల క్లబ్‌లో చేరడం కష్టమేనని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి ప్రారంభంలో కొన్ని విమర్శలు ఎదురయ్యాయి. ముఖ్యంగా జాన్వీ కపూర్ పాత్ర చిత్రీకరణపై సోషల్ మీడియాలో కొన్ని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా, బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగించింది. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం భారీ వసూళ్లను నమోదు చేసి రామ్ చరణ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచింది. అయితే చిత్రబృందం వెంటనే స్పందించి కొన్ని సన్నివేశాల్లో మార్పులు చేయడం, అదనపు సీన్లను జోడించడం ద్వారా ప్రేక్షకులకు మరింత చేరువైంది. 1990ల విజయనగరం నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రంలో రవాణా సౌకర్యాలు లేని కొండ ప్రాంత ప్రజల సమస్యల కోసం పోరాడే 'పెద్ది' అనే పాత్రలో రామ్ చరణ్ కనిపించారు. కూలీగా, క్రికెటర్‌గా, రెజ్లర్‌గా మూడు విభిన్న కోణాల్లో కనిపించిన చరణ్ తన శారీరక మార్పులు, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. భావోద్వేగ సన్నివేశాలు, క్రీడా నేపథ్యం, గ్రామీణ వాతావరణం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడిన 'పెద్ది' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం జూలై 2 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా సినిమా అందుబాటులోకి రానుంది.

## డెడ్లీ డాక్టర్‌గా రజనీకాంత్



అగ్ర కథానాయకుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ తన 173వ సినిమాతో మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. 'ధర్మన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తలైవా 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నారు. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా రజనీకాంత్ పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా, ఉలగనాయగన్ కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రజనీ, కమల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత సినిమా రావడం విశేషం. ఈ చిత్రంలో సిమ్రన్, రాశీ ఖన్నా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా చిత్రబృందం 'ది ఓజీ స్వాగ్' అనే క్యాప్షన్‌తో టైటిల్ పోస్టర్ మేకింగ్ వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోలో రజనీకాంత్ స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్ మరోసారి అభిమానులను ఫిదా చేస్తున్నాయి. డాక్టర్ కోట్‌లో స్టెతస్కోప్‌తో, సీరియస్ లుక్‌లో తలైవా లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ధర్మన్' టైటిల్ మేకింగ్ వీడియో విడుదల ఇష్ఘుతీఝఱ । అగ్ర కథానాయకుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ తన 173వ సినిమాతో మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. 'ధర్మన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తలైవా 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నారు. విజయనగరం నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రంలో రవాణా సౌకర్యాలు లేని కొండ ప్రాంత ప్రజల సమస్యల కోసం పోరాడే 'పెద్ది' అనే పాత్రలో రామ్ చరణ్ కనిపించారు. కూలీగా, క్రికెటర్‌గా, రెజ్లర్‌గా మూడు విభిన్న కోణాల్లో కనిపించిన చరణ్ తన శారీరక మార్పులు, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. భావోద్వేగ సన్నివేశాలు, క్రీడా నేపథ్యం, గ్రామీణ వాతావరణం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడిన 'పెద్ది' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రంవిజయనగరం నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రంలో రవాణా సౌకర్యాలు లేని కొండ ప్రాంత ప్రజల సమస్యల కోసం పోరాడే 'పెద్ది' అనే పాత్రలో రామ్ చరణ్ కనిపించారు. కూలీగా, క్రికెటర్‌గా, రెజ్లర్‌గా మూడు విభిన్న కోణాల్లో కనిపించిన చరణ్ తన శారీరక మార్పులు, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. భావోద్వేగ సన్నివేశాలు, క్రీడా నేపథ్యం, గ్రామీణ వాతావరణం సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడిన 'పెద్ది' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం న్యాయం కోసం ఏ స్థాయికైనా వెళ్లే డాక్టర్‌గా రజనీకాంత్ ఈ సినిమాలో కనిపిస్తారని టాక్. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారని సమాచారం. మీదకు వెళ్లనుంది. రజనీ మార్క్ యాక్షన్, డైలాగ్స్, ఎమోషన్‌తో పాటు సామాజిక అంశాలను టచ్ చేసే కథతో ఈ సినిమా రూపొందుతోందని తెలుస్తోంది.

## అందర్నీ మెప్పించే 'సూపర్ సుబ్బు



నెట్‌ఫ్లిక్స్ తన తొలి తెలుగు ఒరిజినల్ కామెడీ సిరీస్ 'సూపర్ సుబ్బు' ట్రైలర్‌ను విడుదల చేసింది. మల్లిక్ రామ్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో సందీప్ కిషన్, మిథిలా పాల్కర్, మురళీ శర్మ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సిరీస్ జూలై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ,' సాధా రణంగా ప్రజలు మాట్లాడటానికి సంకోచించే అం శాన్ని హాస్యం, హృదయానికి హత్తుకునే భావోద్వేగాలతో చెప్పే ప్రయత్నం చేశాం. సుబ్బు ఒక సమస్యను పరిష్కరిం చాలనుకుని చివరికి మరిన్ని సమస్యల్లో చిక్కు కుంటాడు. ఉద్యోగ సమస్యలు, ప్రేమలో ఎదురయ్యే ఇబ్బందులు, కుటుంబ ఒత్తిళ్లు, గ్రామస్తులతో వచ్చే అపార్థాలు మరింత వినోదాత్మకంగా ఉంటాయి. మాకి పూర్‌లోని ప్రతి పాత్ర ప్రత్యేకం అని తెలిపారు. 'హాస్యంతో పాటు మానవ సంబంధాలు, అంగీకారం, పరస్పర అవగాహన వంటి అంశాలను ఎంతో అందంగా చెప్పిన కథ ఇది- అని మిథిలా పాల్కర్ చెప్పారు. మల్లిక్ రామ్, రమేష్ ఎలిగేటి, శివాని ధోబాల్ రచించిన ఈ సిరీస్‌ను చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, భరత్ లక్ష్మీపతి నిర్మించారు. గెటప్ శ్రీను, మానసా చౌదరి, జీవన్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషించారు. సినిమా సాధించిన వసూళ్లను అధిగమించడమే మెగా అభిమానుల ప్రధాన లక్ష్యంగా మారింది. 'దేవర'కు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించడంతో, 'పెద్ది' మరింత భారీ విజయాన్ని అందుకుంటుందని అభిమానులు ఆశించారు. విజయనగరం నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రంలో రవాణా సౌకర్యాలు లేని కొండ ప్రాంత ప్రజల సమస్యల కోసం పోరాడే కనిపించారు. కూలీగా, క్రికెటర్‌గా, రెజ్లర్‌గా మూడు విభిన్న కోణాల్లో కనిపించిన చరణ్ తన శారీరక మార్పులు, సినిమా సాధించిన వసూళ్లను అధిగమించడమే మెగా అభిమానుల ప్రధాన లక్ష్యంగా మారింది. 'దేవర'కు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించడంతో, 'పెద్ది' మరింత భారీ విజయాన్ని అందుకుంటుందని అభిమానులు ఆశించారు. మాకి పూర్‌లోని ప్రతి పాత్ర ప్రత్యేకం అని తెలిపారు. 'హాస్యంతో పాటు మానవ సంబంధాలు, అయితే విడుదలైన తొలి రోజే 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.135 కోట్ల గ్రాస్ వసూళ్లను నమోదు చేసి బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. మొదటి వారంలోనే సినిమా అద్భుతమైన కలెక్షన్లు సాధించి రామ్ చరణ్ కెరీర్‌లో అతిపెద్ద సోలో హిట్‌గా నిలిచింది. ప్రస్తుతం ఈ చిత్రం రూ. కోట్ల మార్క్ దిశగా అడుగులు వేస్తున్నప్పటికీ, థియేట్రికల్ రన్ ముగింపు దశకు చేరుకోవడంతో రూ.500 కోట్ల క్లబ్‌లో చేరడం కష్టమేనని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి ప్రారంభంలో కొన్ని విమర్శలు ఎదురయ్యాయి.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449